నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కరీంనగర్
పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల
సోమవారం 25 నవంబర్ 2024 11 పేజీలు

# మహారాష్ట్ర ఓటమితో కాంగ్రెస్ కళ్ళు తెరవాలి

- తెలంగాణ ఫెయిల్యూర్‌ను మహారాష్ట్ర ప్రజలు గ్రహించారు
- 101 దేవుళ్లను మోసం చేసిన రేవంత్ కు ప్రజలు లెక్కనా...!?
-అబద్దాలలో రేవంత్ రెడ్డికి డాక్టరేట్
- మాజీ మంత్రి హరీష్ రావు



**సూర్య, హుజురాబాద్**

మహారాష్ట్రలో కాంగ్రెస్ ఓటమి ద్వారా అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టలేరని స్పష్టమైందని, మహా ఓటమితో అయినా కాంగ్రెస్ కళ్ళు తెరవాలని, అబద్ధాలు మానాలని బిఆర్ఎస్ అగ్ర నేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. ఆదివారం ఆయన హుజురాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్ లో విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఎన్నో అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ అతి త్వరగానే తన సహజ రూపాన్ని ప్రజలకు తెలియజేసిందని అన్నారు. అధికారంలో కి వచ్చిన రెండు నెలల్లోనే ఇచ్చిన హామీలు అమలు చేయడంలో గాని పరిష్కరించడంలో గాని పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత ప్రారంభమైందని అన్నారు. ఇటీవల జరిగిన మహారాష్ట్ర లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ ఫెయిల్యూర్స్ సరిహద్దులో ఉన్న జిల్లాల ప్రజలకు పూర్తిగా అర్థమైందని, అందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం చేసిన నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని అన్నారు. కర్ణాటక రాష్ట్రంలో గెలవగానే అదే ఊపులో అక్కడి డబ్బుతో (మిగతా 2లో)



### సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే
# డేటా ఎంట్రీ కీలకమైనది

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మంత్రి భట్టి విక్రమార్క మల్లు

- డోర్ లాక్, వలసవెళ్ళిన వారి వివరాలు ఫోన్‌కాల్ ద్వారా సేకరించాలి
- సమగ్ర ఇంటింటి కుటుంబసర్వే పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



**సూర్య కరీంనగర్ ప్రతినిధి**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుందని, సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వవద్దని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం ఉదయం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జారండ్ రాజధాని రాంచీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ సర్వే డేటా ఎంట్రీ లో నాణ్యత చాలా ముఖ్యమైందని, ప్రభుత్వం ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వే దశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం వంటి కొన్ని సమస్యలు తలెత్తాయి కాబట్టి.. వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమబద్ధకరించుకోవాలని, వారిని అందుబాటులో ఉండేలా కోరాలని ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా (మిగతా 2లో)



### పెద్దపల్లి జిల్లా రైతుల చిరకాల ఆకాంక్ష
# పత్తిపాక రిజర్వాయర్ నెరవేర్చే దిశగా ప్రభుత్వం

- బీడు భూములకు సాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు

**సూర్య ధర్మారం**



పెద్దపల్లి జిల్లా రైతుల చిరకాల ఆకాంక్ష పత్తిపాక రిజర్వాయర్ నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని, రైతులతో సంప్రదింపులు జరుగుతూ ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తుందని, ప్రజలకు ఇచ్చిన హామీ అమలు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. ధర్మారం మండలంలోని పత్తిపాక రిజర్వాయర్ వద్ద నూతనంగా నిర్మించనున్న పత్తిపాక రిజర్వాయర్ కి సంబంధించిన స్థలాన్ని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎమ్మెల్యే విజయ రమణా రావు,ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ,ఇరిగేషన్ అధికారులు,మండల నాయకులతో కలిసి ఆదివారం రోజున పరిశీలించారు.కార్యక్రమానికి ముందు రాష్ట్ర మంత్రివర్యులు శ్రీధర్ బాబుకి విప్ లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలోఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూఆర్థిక వనరులు సమకూరుస్తూ ఒక్కో హామీ అమలు చేస్తున్నామని,టెయిల్ ఎండ్ ప్రాంతాల ఆయకట్టు సమస్యలకు శాశ్వత పరిష్కారంగా (మిగతా 2లో)



# సభ్యత్వ నమోదులో కరీంనగర్ టాప్

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- జిల్లా అధ్యక్షుడి చేతుల మీదుగా క్రియాశీల సభ్యత్వం తీసుకున్న బండి

**సూర్య కరీంనగర్‌ప్రతినిధి**



భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదులో కరీంనగర్ జిల్లా అగ్రభాగాన నిలిచింది. పార్టీ నాయకత్వం విధించిన లక్ష్యాన్ని మించి సభ్యులను నమోదు చేసిందనీ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.సభ్యత్వ నమోదులో కరీంనగర్ జిల్లా అగ్రభాగాన నిలిచిన సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం జిల్లా పార్టీ కార్యకర్తలను ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నాయకులు బండి సంజయ్ ను కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడి చేతుల మీదుగా బండి సంజయ్ క్రియాశీల సభ్యత్వాన్ని తీసుకున్నారు. సభ్యత్వ నమోదు వివరాలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్ కరీంనగర్ జిల్లా అగ్రభాగాన నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అట్లాగే అసెంబ్లీ వారీగా చూస్తే కరీంనగర్, పార్లమెంట్ వారీగా చూస్తే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం సైతం నాయకత్వం విధించిన లక్ష్యాన్ని మించి సభ్యత్వ నమోదు చేయడం హర్షణీయమన్నారు. "కార్యకర్తలకు హ్యాట్సాఫ్ చెబుతున్నా. వాళ్ల క్రుషి ఫలితంగానే సభ్యత్వ నమోదులో నెంబర్ వన్ గా నిలిచాం. నా తరపున పార్లమెంట్ నియోజకవర్గంలోని కార్యకర్తలందరికీ అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సంధర్బంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 37 లక్షల 67 వేల సభ్యత్వాన్ని నమోదు చేయించాలని లక్ష్యం విధించగా, (మిగతా 2లో)

# మహారాష్ట్ర " ఓటమితో కాంగ్రెస్ కళ్ళు తెరవాలి

(మొదటి పేజి తరువాయి)

ఇక్కడ గ్లోబల్ ప్రచారాలు చేసి కాంగ్రెస్ విజయం సాధించిందని అన్నారు. కానీ తెలంగాణలో 11 నెలల కాంగ్రెస్ పార్టీ పాలనను చూసి వారి వైఫల్యాలను చూసినా మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలను, ఐదు గ్యారెంటీలను తిరస్కరించారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజల బాగోగుల కోసం ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం ప్రయత్నం చేయాలని హరీష్ రావు హితవు పలికారు.

**- అబద్ధాలతో రేవంత్ రెడ్డికి డాక్టరేట్**

లేనిది ఉన్నట్టు.... ఉన్నది లేనట్టు.... కనికట్టు మాటలతో.... అబద్ధపు ప్రచారాలతో... గోబెల్స్ ను మించిన నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. అందుకే ఆయనకు అబద్దాలలో డాక్టరేట్ ఇవ్వాలని అన్నారు. మొదట కాంగ్రెస్ వారు కాళేశ్వరం కూలిపోయిందని, లక్షల కోట్లు వృధా అయ్యాయని అబద్ధపు ప్రచారం చేశారు. మళ్లీ ఇప్పుడేమో హైదరాబాద్ కు తాగునీళ్లు ఇవ్వడానికి కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మల్లన్న సాగర్, కొండపోచమ్మల నుండి 20 టీఎంసీల నీరును తీసుకొని వస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం వారి అబద్ధాల కోరు తనాన్ని తెలియజేస్తుందన్నారు. ఒకవేళ కాళేశ్వరం కూలిపోతే కొండపోచమ్మ నుండి మూసి నదికి గోదావరి నీళ్లు ఎలా తెస్తారని, సీఎం రేవంత్ రెడ్డి టెండర్లు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. మూసికి ఐదు టీఎంసీల నీరు ఇలా అందిస్తారో చెప్పాలని అన్నారు. మిషన్ భగీరథ ఒక ఫెయిల్యూర్ పథకం అని, నీరు గ్రామీణ ప్రాంతాల్లో అందడం లేదని విమర్శించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మూసీ నది ద్వారా నీటినీ భగీరథ మాదిరిగా అందించాలని, ఇంజనీర్లు కోరడం వారి దివాలా కోరుతనాన్ని తెలియజేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి విషయంలో ప్రజలను మోసం చేస్తూ కాలాన్ని వెళ్లదీస్తుందని అన్నారు. దళిత బంధు నిధుల విషయంలో ప్రభుత్వం సరైన స్పందన ఇవ్వకపోతే డిసెంబర్ 9 నుండి ప్రారంభమయ్యే అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఆయన అన్నారు. అక్రమ కేసులు దళితులపై పెట్టిన విషయం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దృష్టి పెట్టి వాటిని తొలగించాలని ఆయన అన్నారు. కాళేశ్వరం నీరు లేకున్నా లక్షల టన్నుల వరి పంట పండిందని చెప్తున్నా కాంగ్రెస్ తెలంగాణలో సగం కాళేశ్వరం నుండే నీరు అందిస్తున్న విషయం తెలియదా అని ఆయన ప్రశ్నించారు. వారం లోగా హైదరాబాద్ కు మంచినీరు అందించాలని చెప్తున్న సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే ఈ నీరు రావాలని చెప్పడం ఆయన ద్వందనీతికి నిదర్శనం అని అన్నారు.

**- 101 దేవుళ్ళని మోసం చేసిన**

**రేవంత్ రెడ్డికి ప్రజలు లెక్కనా...!?**

రుణమాఫీ పై రాష్ట్రంలో ఉన్న 101 దేవాలయాల పై ఓట్లు పెట్టి సగం మంది కూడా రుణమాఫీ చేయని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేయడం ఓ లెక్కన అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. రైతుబంధు ఇప్పటికీ పూర్తిగా అందించని కాంగ్రెస్ పార్టీ రైతు వారోత్సవాల పేరిట జరుపుకునే అర్హత ఉందా అని ప్రశ్నించారు. రైతులను ఆగం చేసిన వారికి రైతు వారోత్సవాలు ఎలా జరుపుతారు అని ప్రజలు అనుమాన పడుతున్నారని అన్నారు. కాళేశ్వరంలో 156 పిల్లర్లకు గాను 2 పిల్లర్లు చెడిపోతే ఆగం చేసిన కాంగ్రెస్ నాయకులు అదే ప్రాజెక్టుతో మూసి నింపుతారు అంటే ప్రజలు నవ్వుతున్నారని అన్నారు. కూలిపోయిందన్న కాళేశ్వరం కాంగ్రెస్ కు దీపమైందని ఆయన ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఆఫ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, సంగెం ఐలయ్య, బి. వెంకటేశ్వర్లు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా రైతుల చిరకాల ఆకాంక్ష పత్తిపాక రిజర్వాయర్ నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులు

(మొదటి పేజి తరువాయి)

పత్తిపాక రిజర్వాయర్ నిలుస్తుందని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం ద్వారా పెద్దపెల్లి జిల్లా రైతాంగానికి మేలు జరుగుతుందని ఆలోచనతో ఇక్కడి ప్రజాప్రతినిధులు నీటి పారుదల శాఖ మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి ప్రాథమిక పనులు ప్రారంభించామని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన స్థలం, భూ సేకరణ ప్రతిపాదనలు , ఇతర అంశాలతో కూడిన డిపిఆర్ తయారు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం చేపట్టే పత్తిపాక రిజర్వాయర్ ద్వారా జిల్లాలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందుతూ 2 లక్షల 40 వేల ఎకరాల స్థిరీకరణ తో పాటు నూతనంగా 10 వేల ఎకరాల ఆయకట్టు వస్తుందని అన్నారు. అతి తక్కువ ఖర్చుతో అధిక లాభం సమకూరే విధంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. టెయిల్ ఎండ్ ప్రాంతాల సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పత్తిపాక రిజర్వాయర్ నిలుస్తుందని మంత్రి అన్నారు. గతంలో కూడా జిల్లాకు ఆయకట్టు అందించే ఎస్ ఆర్ ఎస్ పి, ఎల్లంపల్లి, వరద కాలువ, మిడ్ మానేరు, లోయర్ మానేరు డాం ప్రాజెక్టులను తమ హయాంలోని నిర్మించామని అన్నారు. పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం కోసం స్థానిక ప్రజా ప్రతినిధులైన ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రభుత్వంపై బాగా ఒత్తిడి తీసుకొని వచ్చారని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో గతంలో ఎన్నడు లేని విధంగా మన రైతు సోదరులు అత్యధికంగా వరి సాగు జరిగే ఉత్పత్తి సాధించారని, వరి పంటకు మద్దతు ధరతో పాటు సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు ప్రతి బస్తాకు నాలుగు నుంచి ఐదు కేజీలు తరుగు పేరుతో మోసం చేశారని, తమ ప్రజా ప్రభుత్వం రాగానే తరుగు లేకుండా పూర్తి స్థాయి పంట కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి సన్న రకం ధాన్యం వడ్లకు బోనస్ రైతులకు అందుతుందని, ఈ కార్యక్రమం వల్ల రైతులు చాలా సంతోషంతో ఉన్నారని మంత్రి తెలిపారు. ఆర్థిక వనరులను సమకూరుస్తూ ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తామని అన్నారు. మన జిల్లా నుంచి గోదావరి జిల్లాలో తరలిస్తూ ఇక్కడ ఆయకట్టు పెంచడంలో గత ప్రభుత్వాలు ఘోర వైఫల్యం పొందాయని, మన దగ్గర బ్యారేజీలు నిర్మించినా ఎటువంటి అదనపు ఆయకట్టు రాలేదని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోనే శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ప్రభుత్వంతో మాట్లాడి యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాలను మంజూరు చేయించారని, తన శాసనసభ పరిధిలోని ఆరోగ్యం, పాఠశాలలు రోడ్ల నిర్మాణ పనులకు ప్రత్యేక కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.వేణు, రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, నీటిపారుదల శాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ కీలకమైనది

(మొదటి పేజి తరువాయి)

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ క్రమబద్ధరీకరించుకోవాలని తెలిపారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయని, ఈ పాఠశాలలో ఆహారం, పరిశుభ్రత పై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫుడ్ పాయిజనింగ్ వంటి సమస్యలు తలెత్తకూడదనే మెస్, కాస్మోటిక్స్ చార్జీలను ప్రభుత్వం పెంచిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ జిల్లాలో సుమారు మూడు లక్షలకు పైగా ఇళ్ళు ఉండగా ఇప్పటివరకు 95.1శాతం సర్వే పూర్తయిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో సర్వే పూర్తయిందన్నారు. జిల్లాలో సర్వే కు ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. హౌస్ లిస్టింగ్ చేసినప్పుడే ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చామన్నారు. ఎన్యూమరేటర్లు సర్వే కు వెళ్ళినప్పుడు ఇంట్లో ఎవరో ఒకరు కుటుంబసభ్యులు ఉంటున్నారని.. వారి ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఇళ్లకు తాళం వేసి ఉంటే వారి ఫోన్ నెంబర్ తీసుకొని సర్వే గురించి సమాచారం ఇస్తున్నట్లు వివరించారు. మహిళా సంఘాలు, బీఎల్ఓలు, స్థానికుల సహకారం తీసుకుంటున్నట్లు తెలిపారు. తాళం వేసి ఉన్న ఇళ్ళకు వెళ్లి డబుల్ చెక్ చేస్తున్నామని చెప్పారు. సర్వే ప్రక్రియను ప్రతి రోజు పర్యవేక్షిస్తున్నామని.. క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులను సమన్వయం చేసుకుంటూ అందరి వివరాలు పక్కాగా నమోదు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ (స్థానిక సంస్థలు), నగరపాలిక కమిషనర్ చాహత్ బా జ్ పాయ్ జడ్పీసీఈఓ వెంకటేశ్వర్లు సీపీవో కొమరయ్య,తదితరులు పాల్గొన్నారు

# సభ్యత్వ నమోదులో కరీంనగర్ టాప్

(మొదటి పేజి తరువాయి)

నేటి వరకు దాదాపు 30 లక్షల సభ్యత్వం నమోదు చేశారు. అనుకున్న లక్ష్యంలో 75 శాతానికి చేరుకోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్ జిల్లా అగ్రభాగాన నిలిచింది. ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 2 లక్షలకుపైగా సభ్యత్వాన్ని నమోదు చేయడం విశేషం. సభ్యత్వ నమోదులో భూపాలపల్లి, ములుగు జిల్లాలు అట్టడుగున ఉన్నాయి. ఆయా జిల్లాల్లో 20 వేలలోపే సభ్యత్వం నమోదైంది. అసెంబ్లీ వారీగా చూస్తే కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి 61 వేల మంది సభ్యులను చేర్పించాలని లక్ష్యం విధించగా, 70 వేలకుపైగా సభ్యులను నమోదు చేయించడం విశేషం. పార్లమెంట్ నియోజకవర్గం వారీగా పరిశీలిస్తే...ఇచ్చిన టార్గెట్ ను అధిగమించిన పార్లమెంట్ నియోజకవర్గాల్లో కరీంనగర్ అగ్రభాగాన నిలిచింది. ఇప్పటి వరకు దాదాపు 3 లక్షలకుపైగా సభ్యత్వాన్ని నమోదు చేశారు. కరీంనగర్, హుస్నాబాద్, హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో విధించిన లక్ష్యాన్ని మించి సభ్యత్వాన్ని నమోదు చేయడం గమనార్హం అని అన్నారు.

# క్రమశిక్షణ కలిగి యువతతో భవిత

**- మాజీ ఎమ్మెల్యే సతీష్ బాబు**

**సూర్య, హుజురాబాద్ రూరల్**



క్రమశిక్షణ కలిగిన యువత దేశాన్ని పటిష్టంగా నిర్మిస్తారని, వారితోనే మనకు భవిత అని హుస్నాబాద్ మాజీ శాసన సభ్యుడు, కిట్స్ కార్యదర్శి వి. సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం హుజురాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలోని కిట్స్ లో 76వ ఎన్.సి.సి ఆవిర్భావ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉత్తమ క్రమశిక్షణను అలవర్చుకొనే అవకాశం ఎన్.సి.సి క్యాండేట్లకు లభిస్తుందని, ఎన్.సి.సి ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పొందవచ్చునని, ఉత్తమ వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవచ్చని అన్నారు. ముఖ్య వక్త సుబేదార్ సూర్యప్రసాద్ మాట్లాడుతూ ఎన్.సి.సి విద్యార్థులకు ఉన్నత చదువులలో ఉద్యోగాలలో ఎక్కువ అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే. శంకర్ మాట్లాడుతూ కళాశాలలో ఎన్.సి.సి విభాగము ఉన్నదని, ఉత్సాహవంతులైన విద్యార్థులు యూపీఎస్సీ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలలో ఎన్.సి.సి పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఎన్.సి.సి సర్టిఫికెట్ పొందడం వలన విద్యార్థులకు మానసిక ధైర్యం పెరుగుతుందని, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని అన్నారు. కళాశాల ఎన్.సి.సి అధికారి మేజర్ డాక్టర్ కె. రవీంద్ర బాబు మాట్లాడుతూ ఎన్.సి.సి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కళాశాలలో గత వారం రోజులుగా నిర్వహించామని, విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలలో బహుమతులు పొందిన క్యాడేట్లకు బహుపదులను అందజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వి. శమిత, హవల్దార్ షిండే, కళాశాల అధ్యాపకుడు భాస్కర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు చదువులో రాణించాలంటే టీచర్ల పాత్ర ఎంత ఉందో తల్లిదండ్రుల పాత్ర అంతే ఉంటుంది

**- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు**

**సూర్య మానకొండూరు**



మానకొండూరు మండల కేంద్రంలోని ఎడ్యుకేషన్ అవేర్నెస్ ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పిల్లల్లో చదువు పట్ల ఆసక్తి పెరిగి మంచిగా రాణించాలంటే టీచర్ల పాత్ర ఎంత ఉందో తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా పిల్లలు ఏం చేస్తున్నారు అనేది తల్లిదండ్రులు ఎప్పుడు గమనిస్తూ ఉండాలని చెప్పారు. పిల్లలు చదువులో ఉన్న శ్రద్ధ ఏ సబ్జెక్టుల వారిగా ఎంతవరకు ఉందనేది ఇంటికి వచ్చాక ఒకసారి చెక్ చేయాలని కోరారు. చదువుతో పాటుగానే పిల్లల్లో ఉండే సృజనాత్మకతమైన అంశాలు ఏవైనా ఉంటే వాటిని గుర్తించి ప్రోత్సహించాలని చెప్పారు. చదువుతోపాటుగా ఆటల్లో రాణించేలా వారిని ప్రోత్సహించలని కోరారు. చదువులో వచ్చే మార్పులే వారి కొలమానంగా తీసుకోవద్దని సూచించారు. పెద్దలపట్ల, సమాజం పట్ల సేవా దృక్పథం కలిగి ఉండేలా ప్రోత్సహించాలని అన్నారు. సెల్ ఫోన్లు వాడడం వల్ల వచ్చే అనర్థాలను ముందుగా గుర్తించి సెల్ ఫోన్ లకు దగ్గర అవ్వకుండా చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ట్రస్మా ఉపాధ్యక్షుడు పచ్చునూరి సురేందర్ మానకొండూరు మండల ట్రస్మ అధ్యక్షుడు రవీందర్ తస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
రాజన్నసిరిసిల్ల
సోమవారం 25 నవంబర్ 2024




# సంపూర్ణ సమగ్ర కుటుంబ సర్వే నమోదు చేయాలి

## - విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పోలాస నరేందర్

**సూర్య వేములవాడ**

సమగ్ర ఇంటింటి సర్వేలో విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) కులం బదులు, కులవృత్తులుగా నమోదైన సంఖ్య మొత్తంను విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ)కుల సంఖ్యగా పరిగణించాలని విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు పోలాస నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వేలో సర్వే చేయు అధికారులు ఇండ్లకు వచ్చిన సమయంలో డోర్ లాక్ ఉండడం వలన వారి వివరాలు సర్వేలో నమోదు కాలేదని, డోర్ లాక్ వలన కొన్ని కుటుంబాలు సర్వే నమోదులో తప్పినట్లు తెలుస్తుందన్నారు. ఇప్పటి వరకు సర్వేలో నమోదు అయిన వారి వివరాలను అన్ లైన్ చేయడానికి కంప్యూటర్ డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ కూడ ఇచ్చినట్లు తెలుస్తోంద కనుక త్వరగా డోర్ లాక్ వలన తప్పిన కుటుంబ వివరాలను సర్వేలో చేర్చుటకు ప్రత్యేకించి మరొక మారు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించుటకై ఏదేని కార్యాలయంలో గాని లేక ఏదేని ప్రాంతంలో గాని ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తే, సమగ్ర సర్వేలో మళ్ళీ నమోదు చేసుకునే అవకాశం ఉండునని తెలిపారు. లేనిచో కొన్ని కుటుంబాలు వారి



వివరాలను సమగ్ర సర్వేలో నమోదు చేసుకునే అవ కాశం కోల్పోతారని, అందువల్ల ప్రత్యేక కౌంటర్ ఒకటి ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇలా చేయడం వలన సంపూర్ణంగా సమగ్ర సర్వే జరిగినట్లు ఉంటుందని, అంతే కాకుండా కులగణన వివరాలు సర్వేలో పూర్తిగా నమోదై బీసీ జనాభా తెలుస్తుందన్నారు. బీసీ జనాభా ప్రాతిపతికపైన రిజర్వేషన్ల నిర్ణయము జరిగి బీసీలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉపాధి పరంగా న్యాయం జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అలాగే సమగ్ర సర్వేలో సేకరించిన సామాజిక, ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో వచ్చిన వివరాలను సైబర్ నేరగాళ్లను దృష్టిలో ఉంచుకొని, సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని భద్రపరచాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాల వారీగా బీసీ కమిషన్ పక్షాన నిర్వహించిన సమావేశాలలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ రాజకీయాలకు అతీతంగా వివిధ బీసీ కులసంఘాలు ఇచ్చిన వినతి పత్రాలలను పరిశీలనచేసి, వాటి పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని విన్నవించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇంటింటా కుటుంబ సభ్యుల కులగణన సమగ్ర సర్వే పారదర్శకంగా జరగాలని, బీసీ కులాలు రాజకీయాలకు అతీతంగా కోరుకుంటున్నారని, ఎందుకంటే సమగ్ర సర్వేలో తేలిన బీసీ జనాభా పైననే బీసీ రిజర్వేషన్ల నిర్ణయం జరుగునన్నారు. సర్వేలో తప్పి పోయిన కుటుంబాల సమాచారాన్ని మళ్ళీ సేకరించాలని, సేకరించిన సమాచారాన్ని భద్రపరచాలని తెలిపారు. బీసీ కమిషన్ కు బీసీ సంఘాలు ఇచ్చిన వినతి పత్రాలను పరిశీలించి వాటి పరిష్కారం చేయాలని, బీసీ జనాభా ప్రకారం రానున్న అన్ని ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అలాగే విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) కులానికి బదులుగా విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) వృత్తులు అయిన ఇనుము, కర్ర,ఇత్తడి,రాతి,వెండిబిబంగారు వృత్తులను చూపిన 5 కాలాలలో నమోదైన వారందరినీ విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ)కులంగా గుర్తించి అట్టి సంఖ్యను విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) కులంగా తీసుకోవాలని ప్రత్యేకించి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# బండి సంజయ్ చౌకబారు విమర్శలు మానుకోవాలి

## - మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హమీద్

**సూర్య గంభీరావుపేట**

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కాంగ్రెస్ పై చౌకబారు విమర్శలు మానుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ హమీద్ అన్నారు. ఆదివారం రోజున కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలొ హమీద్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు ఆపి కేంద్రం నుంచి బండి సంజయ్ అభివృద్ధి నిధులు తీసుకువచ్చి కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.శనివారం రోజున మండల పర్యటనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బండి సంజయ్ చేసిన వాక్యాలను తీవ్రంగా ఖండించారు. మానేరు వాగుపై నిర్మిం



చిన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంలో ప్రభుత్వం వాటా 40 శాతం, లింగన్నపేట కోరుట్ల పేట బిటి డబల్ రోడ్డులో కూడా 40 శాతం ఉందా లేదా అని బండి సంజయ్ ప్రజలకు సమాధానం చెప్పాలని మండిపడ్డారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోడీ ఇప్పటివరకు ఎన్ని ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారో సమాధానం చెప్పాలని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేస్తుంటే జీర్ణించుకోలేకనే విమర్శలు చేస్తున్నారని మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత గ్యాస్ సబ్సిడీ, 2 లక్షల రుణమాఫీ, 200 యూనిట్ల వరకు జీరో కరెంట్ బిల్లు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రైతు కళ్ళలో ఆనందం చూడడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్మని ప్రభుత్వంపై విమర్శలు మానుకోవాలని హమీద్ అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజు గౌడ్ ఎడబోయిన ప్రభాకర్ జంగంరాజు సుత్రాతుళ్ళ అక్క పెల్లి బాలయ్య లచ్చయ్య గౌరీ శంకర్ కుమార్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### మహాత్మ జ్యోతిబా పూలే ఆశయాలు కొనసాగాలి

#### - పూలే విగ్రహావిష్కరణలో కెకె మహేందర్ రెడ్డి

**సూర్య ముస్తాబాద్**



మహాత్మా జ్యోతిబా పూలే జీవితం నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి కెకె మహేందర్ రెడ్డి అన్నాడు.ఆదివారం మండలంలోని నామ పూర్ చౌరస్తా వద్ద గొడుగు శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిబా పూలే దంపతుల నూతన విగ్రహావిష్కరణలో మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. విగ్రహావిష్కరణ అనంతరం ఆయన ప్రసంగిస్తూ జ్యోతిబా పూలే సావిత్రి భాయి పూలేలు ఆనాడు విద్యకు పెద్ద పీట వేశారని అన్నారు. గాంధీ తర్వాత మరో మహాత్ముడు పూలే అని కొనియాడారు. పూలే ముదిరాజ్ కులంలో పుట్టి నేడు విద్యావంతులకి ఆదర్శంగా నిలవడం గొప్ప విషయం అన్నారు.ముదిరాజ్ ల సమస్యలు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు.ముదిరాజ్ లను బిసి డి నుండి ఏ లోకి మార్చడం పై ప్రభుత్వం సానుకూలంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ జిల్లా నాయకులు, మండల, గ్రామ అధ్యక్షులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ

**సూర్య వేములవాడ**



వేములవాడ పట్టణంలో అనారోగ్యంతో మరణించిన కీసరి దేవమ్మ, పుప్పాల గంగాధర్, గిన్నెల రవికుమార్, బాశెట్టి వేణుగోపాల్ కుటుంబాలను ఆదివారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి వెంట వెంగళ శ్రీకాంత్ గౌడ్, మహేష్, రవి, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మధుమేహ నిర్ధారణ శిబిరం

**సూర్య తంగళ్లపల్లి**



తంగళ్ళపల్లి మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సిరిసిల్ల ఆధ్వర్యంలో మధుమేహ నిర్ధారణ, అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో దాదాపు 130 మంది వరకు మధుమేహ నిర్ధారణ పరీక్షలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సిరిసిల్ల అధ్యక్షుడు డాక్టర్ భానుచందర్,మాజీ అధ్యక్షుడు నగునూరి శ్రీకాంత్,క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

#### - నిందితుడిపై ఇప్పటికే 14 కేసులు

**సూర్య రాజన్న సిరిసిల్ల**



ప్రభుత్వ రేషన్ బియ్యం ప్రజలకు అందకుండా అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలానికి చెందిన గగులోతు పాండు అనే వ్యక్తి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జిల్లెల గ్రామంలో నివాసము ఉంటూ రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడని ఎస్పీ తెలిపారు. గత నాలుగైదు సంవత్సరాలుగా ఒక ముఠాగా ఏర్పడి జిల్లాలోని వివిధ మండలాలలో రేషన్ బియ్యం సేకరించి అక్రమంగా మహారాష్ట్ర వంటి ప్రాంతాలలో విక్రయిస్తున్నాడని ఆయన వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇల్లంతకుంట మండలం కూన బోయినపల్లి గ్రామ శివారులో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతుండగా ఇల్లంతకుంట పోలీసులు అరెస్టు చేశారని ఎస్పీ తన ప్రకటనలో పేర్కొన్నారు. నిందితుడిపై ఇప్పటికే రాజన్న సిరిసిల్ల జిల్లాలో 12 కేసులు,సిద్దిపేటలో రెండు కేసులు నమోదు అయ్యాయని ఆయన వివరించారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డా, అక్రమ రేషన్ బియ్యం రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**సూర్య సిరిసిల్ల టౌన్**



సిరిసిల్ల పట్టణంలోని 36వ వార్డు ప్రగతినగర్ కు చెందిన అన్నల్దాస్ లక్ష్మిపతికి 25,500 రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రులలో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని, పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ఆశయంగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుంద ని అన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటేష్,ఎర్రం శంకర్ గురు స్వామి,ఎర్రం మల్లయ్య, ప్రవీణ్, నెల్లుట్ల కనకయ్య,నంగునూరి శ్రీను,మనోహర్ పాల్గొన్నారు.

### ఘనంగా ఎన్ సి సి డే వేడుకలు

**సూర్య తంగళ్లపల్లి**




తంగళ్ళపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ సి సి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా క్యాడెట్టు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపల్ రెహనా ఇఫ్ఫత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడుతూ ఎన్ సి సిలో చేరిన వారికి క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు.విద్యార్థులందరూ సామాజిక సేవ దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### వెలమ వన మహోత్సవ వేడుకలు

**సూర్య బోయినిపల్లి**




బోయినిపల్లి మండలం వరద వెల్లి గ్రామంలో ఆదివారం రోజున వెలమ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తిక మాస వన భోజన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎక్కడె క్కడో ఉన్న అందరూ ఈరోజు గ్రామంలోని రోడ్ నెంబర్ 10లో చేరుకొని, వన మహోత్సవంలో ఉసిరి చెట్టు కింద శాస్త్ర ప్రకారం పూజ చేసుకొని, విష్ణు సహస్ర నామాలు పఠించి, విందు వినోదాలలో పాల్గొని, సాంస్కృతిక కార్యక్రమంలో ముఖ్యంగా మహిళలు ఆనందోత్సవాల మధ్య సాయంత్రం వరకు గడిపారు. ఈ వేడుక ఆహ్వాన కార్యక్రమంలో వన మహోత్సవ వేడుక ప్రాధాన్యతను సలహాదారులుగా పీచర సంపత్ రావు అధ్యక్ష వహించి స్వాగత ఉపన్యాసము చేయగా ప్రధాన కార్యదర్శి డా. పిచర వేణుగోపాల్ రావు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యక్షులు పీచర నరేందర్ రావు, బొమ్మెన రామ్ గోపాల్ రావు కోశాధికారి సంఘ లెక్కలను వివరించినారు. జాయింట్ సెక్రెటరీ పి. శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. రవీందర్రావు




పాటు వెలమ మహి ళలు, పెద్దలు, పిల్లలు దాదాపు 300 మందితో కార్యక్రమం విందు వినోదాలతో ఘనంగా నిర్వహించుకున్నారు.

# జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను ప్రజలు క్షమించరు

## - ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలు

**సూర్య జగిత్యాల**



ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ లాంటి వ్యక్తులను ప్రజలు క్షమించరని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. బంజారాహిల్స్ లోని నివాసంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులతో ఎమ్మెల్సీ కవిత ఆదివారమ్ సమావేశమయ్యారు. ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీకి మారిపోయినప్పుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్తే అర్థముండేదని, కానీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా గోడ మీద పిల్లిలాగ ఉండటం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడం లాంటిదని ఎమ్మెల్సీ కవిత ఫైర్ అయ్యారు. ఎమ్మెల్యే పదవిని అడ్డు పెట్టుకోవడం పిరికితనమని, అలాంటి నాయకులు బీఆర్ఎస్ కు అవసరం లేదని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. గులాబీ జెండా అంటేనే గుండె ధైర్యం, గులాబీ జెండా అంటేనే ఉద్యమ పిడికిలి అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పిరికివాళ్లు, పదవుల వ్యామోహం ఉన్న వాళ్లు బీఆర్ఎస్ పార్టీకి అవసరం లేదన్నారు.

**- నాయకులు పార్టీ మారినా కార్యకర్తలు పార్టీతోనే**

ప్రస్తుతం పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్, అప్పుడు ఎమ్మెల్యే కాకపోయినా, పార్టీ ప్రతి కార్యక్రమంలో వేదిక పైకి తీసుకొచ్చి, కాబోయే ఎమ్మెల్యే అంటూ ఐదు సంవత్సరాల పాటు ప్రతి గ్రామంలో చెప్పామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఓడిపోయినా వదిలేయకుండా గౌరవంగా చూసుకుంటామనే సందేశం ఇచ్చిన సభ్యత గల పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఆనాడు జగిత్యాల ఎమ్మెల్యేగా ఉన్న జీవన్ రెడ్డి ఎన్ని ఆకృత్యాలు, అఘాయిత్యాలు చేసినా, బీఆర్ఎస్ కార్యకర్తలంతా ముందుండి కొట్లాడారు కాబట్టే, జగిత్యాలలో గులాబీ జెండా ఎగిరిందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నాయకులు పార్టీలు మారినా, కార్యకర్తలు పార్టీలోనే ఉంటారని చెప్పడానికి మంచి ఉదాహరణ జగిత్యాల నియోజకవర్గం అని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న సాటి యాదవ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**సూర్య కోరుట్ల రూరల్**



ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయి ఆపదలో ఉన్న సాటియాదవ కుటుంబానికి 80,000/- రూపాయలు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన యాదవులు. కోరుట్ల నియోజక వర్గం పైడి మడుగు గ్రామానికి చెందిన వికలాంగుడు మ్యాకల ఆశన్న యాదవ్ ఇటీవల మృతి చెందాడు, భార్య, కూతురు, ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. నిరుపేద కుటుంబం చిన్న పెంకుటిల్లు తప్ప ఏమి లేదని టివిఎస్వి, జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గనవేని మల్లేష్ యాదవ్‌కు తెలుపగా స్పందించి జిల్లాలో ఉన్న యాదవులకు తెలియచేసి మానవతా దృక్పథంతో విరాలాలు అందించి సాటి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలబడుదా మని కోరగా జిల్లాలోని యాదవులందరు స్పందించి 85,216/- అక్షరాల ఏనబై ఐదు వేల రెండు వందల పదహారు రూపాయలు విరాళాలు ఇవ్వగా ఈరోజు పైడి మడుగు గ్రామంలో బాధిత కుటుంబానికి యాదవులందరు కలిసి డబ్బులను అందచేశారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ మాట్లాడు తూ ఆపదలో ఉన్న నిరుపేద యాదవ కుటుంబాలను ఇక ముందు కూడా యాదవులందరం కలిసి ఆదుకుని అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జగిత్యాలలో 'శ్రీనివాసు"ల ఆత్మీయ సమావేశం

**సూర్య జగిత్యాల**



ఆచార్య శ్రీనివాస దైవజ్ఞ, కాళేశ్వరం ఆలోచనతో రూపుదిద్దుకున్న మన మంతా శ్రీనివాసులం అనే గ్రూప్ లో వున్న జగిత్యాల జిల్లా శ్రీనివాసులు, వారి ఆశయ సాధనలో భాగంగా శ్రీనివాసులందరూ మొదటి కార్యక్రమంగా ఆదివారం జగిత్యాల పట్టణంలో శ్రీ పుల్లూరి నారాయణ దాసు ఆశ్రమంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేషారు. ఏఎస్ఐ రాజేశుని శ్రీనివాస్, పర్యవేక్షణలో గాజుల శ్రీనివాస్, పాక శ్రీనివాస్, పాత శ్రీనివాస్, రాజేశుని శ్రీనివాస్‌ల సహకారంతో జరుపుకున్న ఆత్మీయ సమ్మేళనానికి 120 మంది జగిత్యాల టౌన్ జిల్లాలోని వివిధ మండలాల గ్రామాలనుండి శ్రీనివాస మిత్రులు జగిత్యాల విచ్చేసి తమ తమ పరిచయ కార్యక్రమం, తదుపరి కార్యచరణ జనవరి-2025 మొదటి వారంలో జరుగబోయే శ్రీనివాసుల మహా సభను విజయవంతం చేయాలని, తలసేమియా బాధితులకు రక్తదానం చేయాలని సంకల్పించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా వూట్కూరి శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్, కమిటీ సభ్యులు దూస శ్రీనివాస్, విజ్జగిరి శ్రీనివాస్ నార్ల శ్రీనివాస్ ఇతర శ్రీనివాస మిత్రులు పాల్గొన్నారు.

## పోలాసలో సామూహిక కార్తీక వన భోజనాలు

**సూర్య జగిత్యాల**



జగిత్యాల హౌసింగ్ బోర్డులోని శ్రీ గణేష్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జగిత్యాల రూరల్ మండలం పోలాస గ్రామంలోని పౌలస్తీశ్వర స్వామి ఆలయంలో కాలనీవాసులు తమ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, మహిళల దీప దానాలు గోపూజ నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులు ఆలయంలో కార్తీక వన భోజనాలు గావించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రవి కిషన్, అర్చకులు గోవర్ధన శర్మ, గోపాల్ శర్మ, మహేష్ శర్మ, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**సూర్య-కోరుట్ల**



జగిత్యాల జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా వద్దగల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆలిండియా అంబేద్కర్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలను కొందరు దుండగులు కావాలని ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి దుండగులను గుర్తించి కఠినంగా శిక్షిస్తే, మరో మారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కావని వారన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు అంబేద్కర్ విగ్రహాల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు బలిజ రాజారెడ్డి, ఉయ్యాల నరసయ్య, ఉయ్యాల శోభన్, బద్ది మురళి, పసుల కృష్ణ ప్రసాద్, గోరుమంతుల సత్తయ్య, బన్న రాజేష్, సామల వేణుగోపాల్, పసుల చిన్నయ్య, గోరువంతులు నారాయణ, బలిజ సంతోష్ కుమార్, మైస రాజేష్, దామ శ్రావణ్ ఉన్నారు.

## రసాయన శాస్త్రంలో దాసరి రఘుకి డాక్టరేట్

**సూర్య జగిత్యాల**



జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామానికి చెందిన దాసరి రఘుకి రసాయన శాస్త్రంలో చేసిన పరిశోధనకు శాతవాహన విశ్వవిద్యాలయ ఇన్చార్జి పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రంగప్రసాద్ డాక్టరేట్ ప్రకటించారు. డిజైన్, సింథసిస్, కారెక్టరైజేషన్ అండ్ బయోలాజికల్ ఎవాల్యూషన్ ఆఫ్ సమ్ నావెల్ హెటిరోసైక్లిక్ కాంపౌండ్స్ అనే అంశంపై రసాయన శాస్త్ర విభాగ.ఆచార్యులు వి. నమ్రత పర్యవేక్షణలో దాసరి రఘు పరిశోధన పూర్తి చేశారు.

## సైబర్ మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి

**సూర్య జగిత్యాల**



సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్ది సైబర్ నేరగాళ్ళు సరికొత్త రీతిలో ప్రజలను మోసగిస్తున్నారని అవగాహనతోనే సైబర్ మోసాల నుంచి తప్పించుకోవచ్చని ఎస్.బి.ఐ క్యాష్ ఆఫీసర్ నలువాల గంగాధర్ అన్నారు. ఆదివారం జగిత్యాల మినీ స్టేడియంలో స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా జాతీయశాఖ ఆదేశాల మేరకు ప్రజలకు కరపత్రాలతో అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహనా పెంచడంతోనే సైబర్ నేరాల నిర్ములన సాధ్యమవుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కరపత్రాల్లో సైబర్ నేరగాళ్ళ నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడం జరిగిందన్నారు. వీటిపై అవగాహన పెంచుకొంటే సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడకుండా మనల్ని మనం కాపాడుకోని, మన డబ్బులను మనం కాపాడుకోవచ్చన్ని గంగాధర్ సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు గంగాధర్, కృష్ణ, సంతోష్ తోపాటు వాకర్స్ ఉన్నారు.

## అప్పారావుపేటలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన పునుగోటి కృష్ణారావు

**సూర్య కొడిమ్యాల**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని అప్పారావుపేట గ్రామంలో ఆదివారం మాజీ సర్పంచ్ గరిగంటి మల్లేశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొడిమ్యాల మండల సీనియర్ నాయకులు పునుగొటి కృష్ణారావు ప్రారంభించారు. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన ఆదిత్య హాస్పిటల్( సార్గమ్మ దగ్గర) డాక్టర్ మనోహర్ ఎంబిబిఎస్, 68 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారాస మండల అధ్యక్షులు పులి వెంకటేష్ గౌడ్, నాయకులు కొత్తూరి స్వామి, బైరి వెంకటి,మల్యాల మహిపాల్, బిఎస్ఎన్ఎల్ మల్లేషం, హస్పిటల్ సిబ్బంది కాసర్ల రాజు, భరత్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కనక దుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో కార్తీక వనభోజనం

**సూర్య జగిత్యాల**



జగిత్యాల జిల్లా కేంద్రంలోని గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో కార్తీక మాస వనభోజనం కార్యక్రమానికి ప్రజలు అశేషభక్తజనం తరలివచ్చారు. ఆదివారం రోజు దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో కనకదుర్గ సేవా సమితి అష్ట లక్ష్మి దేవాలయం అవరణంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి సమర్పించిన ఓడిబియాన్ని కార్తీక మాసంలో గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయంలో వనభోజనంను ప్రకృతి ఒడిలో కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని కనకదుర్గ సేవా సమితి కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు. అమ్మవారి ఆవరణలో దేవి పారాయణం నిర్వహించగా, నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారికి సమర్పించిన చీరలను స్టాల్స్ ఏర్పాటు చేసి చీరలను వేలం పాటలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అమ్మవారినీ దర్శించుకున్నారు. అనంతం ట్రస్ట్ సభ్యులు సన్మానించి అమ్మవారి చిత్ర పటం అందజేసి, అన్నప్రసాద వితరణ కార్య క్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కనక దుర్గ సేవా సమితి ట్రస్ట్ సభ్యులు గుగిల్ల నాగ భూషణం, రాము, ప్రసాద్, చెట్ పల్లి సుధాకర్, మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా కార్తీక వనభోజన మహోత్సవం

**సూర్య మల్లాపూర్**



పిఆర్టియు-టిఎస్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వాల్గోండా గ్రామ పురాతన ఆలయమైన శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో మహిళా ఉపాధ్యాయులు ఆదివారం భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు జరిపి గోదావరిలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం ఆహ్లాదకరమైన వాతావరణంలో వనభోజన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆనంద రావు, ప్రధాన కార్యదర్శి అమర్ నాథ్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కృష్ణ, లక్కడి శ్రీనివాస్, కుంబాల శ్రీనివాస్ రెడ్డి, సురేఖ, జమునా రాణి, శశికళ, ఉపాధ్యక్షులు అనిత చందన, జిల్లా ఉపాధ్యక్షుడు గురుగుబెల్లి నర్సింగరావు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
పెద్దపల్లి
సోమవారం 25 నవంబర్ 2024



# అడ్రియాల గనిలో రూ.122 కోట్లతో రోడ్ హెడ్డర్స్ యంత్రాలు

**- 3వ సీమ్ డెవలప్ మేంట్ పై దృష్టి - 35 కిలోమీటర్ల డ్రైవేజ్ తవ్వకాలు**

**సూర్య, సెంటినరీ కాలనీ**

దేశంలోనే అతి పెద్ద గని అడ్రియాల గని. అన్ని గనులలో 0-300 మీటర్ల లోతుల్లోంచి బొగ్గు తీస్తే, ఈ గనిలో 300-800 మీటర్ల లోతు లోంచి బొగ్గు తీస్తారు. ఇటువంటి గని నిర్మాణంకు హై కెపాసిటీ కలిగిన లాంగ్ వాల్ టెక్నాలజీకి రూ.1250 కోట్లు ఖర్చు పెట్టారు. 15. 10. 2017లో ప్రారంభమైన ఈ గనిలో 556 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉండగా, 13.36 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేశారు ఈ క్రమంలో మొదటి సీమ్ లో నాలుగు ప్యానల్ లు ఉండగా, రెండు ప్యానల్స్ నుండి బొగ్గు తీసి మూసివేశారు. మూడవ ప్యానల్ త్వరలో మూసి వేస్తారు. కాగా 4వ ప్యానల్ మరో ఆరు నెలల ప్రారంభమవుతుంది. ఇందులో బొగ్గు నిల్వలు మరో మూడేళ్లలో తొలగిస్తారు. ఈ క్రమంలో 3వ సీమ్ డెవలప్ మెంట్ లో నాలుగు ప్యానల్స్ ఉండగా, 214 మిలీయన్ టన్నుల బొగ్గు నిల్వలు తీయాలంటే ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఓసీపీ-2 క్వారీలోని 210 మీటర్ల లోతుల్లోంచి రోడ్ హెడ్డర్స్ యంత్రాల ద్వారా ట్రంక్ రోడ్డు డ్రైవేజ్ ను తవ్వుతారు. ఒక్క మీటర్ డ్రైవేజ్ (సొరంగం) తవ్వడానికి, రూ.35వేల చొప్పున 35 వేల మీటర్లు తవ్వాల్సి ఉండగా, దీనికి రూ.122 కోట్లు ఖర్చు అవుతుంది. మూడు రోడ్ హెడ్డర్స్ ఈ డ్రైవేజ్ ను తొలగిస్తూ ముందుకు సాగుతాయి. 7 సంవత్సరాల వరకు ఈ యంత్రాలు ఇందులో పని చేస్తాయి. హైదరాబాద్ కు చెందిన వెన్సర్ కంపెనీ ఈ టెండర్లు దక్కించుకుందని అడ్రియాల జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు ఆఫీసర్ కొలిపాక నాగేశ్వర రావు, మేనేజర్ కొడెం జనార్ధన్ తెలిపారు. 1.3.2024 న సీఅండ్ఎండీ నునావత్ బలరాం నాయక్ ఈ పనులను శంకుస్థాపన చేసిన విషయం విధితమే.






**35 కిలోమీటర్ల డ్రైవేజ్ తవ్వాలి**

**- కొప్పుల వెంకటేశ్వర్లు, జీఎం**

అడ్రియాల గనిలో 3వ సీమ్ లో బొగ్గు ఉత్పత్తి కొరకు 35 కిలోమీటర్ల ట్రంక్ రోడ్డు డ్రైవేజ్ తవ్వాలి. దీని కొరకు టెండర్లు పూర్తి అయ్యాయి. ఒకటవ సీమ్ లో నాలుగు పానల్ లో బొగ్గు పూర్తి అయ్యేలోగా, మూడో సీమ్ డెవలప్మెంట్ చేయాలి. దీని కొరకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాం.

**3 రోడ్ హెడ్డర్స్ తో డ్రైవేజ్ కు ప్రణాళిక**

**- కొలిపాక నాగేశ్వరరావు, ప్రాజెక్టు ఆఫీసర్**

అడ్రియాల 3వ సీమ్ డెవలప్మెంట్ కు టెండర్లు పూర్తయ్యాయి. 35 కిలోమీటర్ల డ్రైవేజ్ తవ్వకాలకు మూడు రోడ్డు హెడ్డర్స్ రానున్నాయి. మొదట రెండు యంత్రాల ద్వారా పని ప్రారంభిస్తాం. ఇందులో నాలుగు ప్యానల్‌లు ఉండగా, 15 మిలీయన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి.

**అడ్రియాల గనిలో రక్షణపై పూర్తి దృష్టి**

**- కొడెం జనార్ధన్, మేనేజర్**

అడ్రియాల గని మిగితా గనుల కన్నా విభిన్నంగా ఉంటుంది. బొగ్గు ఉత్పత్తి తీయడానికి వివిధ టెక్నాలజీలు వాడుతున్నాం. ఈ క్రమంలో రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి తీయాలి. దీని కొరకు అందరూ కృషి చేయాలి.










## రాష్ట్రస్థాయి క్రీడలకు కనగర్తి విద్యార్థులు

**సూర్య ఓదెల**

అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి జూనియర్ కాలేజీ గ్రౌండ్ లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ క్రీడా పోటీల్లో దాసరి పద్మా హనుమయ్య జెడ్ పి హెచ్ ఎస్ కనగర్తి పాఠశాల విద్యార్థులు అనవేన అర్చన, తాళ్లపల్లి రాజకుమార్, ముద్దమల్ల అజయ్ కుమార్ గోల్డ్ మెడల్ సాధించగా పథకాలతో ఉత్తమ ప్రతిభ కనబరిచి డిసెంబర్ ఒకటవ తేదీన మంచిర్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు తెలిపారు. పిట్టల అక్షిత సిల్వర్ సాధించగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ విద్యార్థులను అభినందించారు.


**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియ జేయునది ఏమనగా షేక్ బాబా @ యాకూబ్ బాబా S/o షేక్ హమీద్ R/O పెద్దపల్లి తన ఇంటి నం.4-3-216/ ఎ/4 / a/2 SY నెం. 688లో 258Sq. Yds భూమ్ నగర్ పెద్దపల్లి పట్టణం మరియు జిల్లాలో ఉంది. హౌసింగ్ లోన్ మరియు తదుపరి ప్రయోజనం కోసం నన్ను సంప్రదించినారు. ఇదే సమయంలో ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం. 62/2001 యొక్క మొదటి పేజీ కమాన్ నుంచి పెద్దపల్లి బస్టాండ్ వద్ద జిరాక్స్ సెంటర్‌కు వెళ్తుండగా పోగొట్టుకున్నట్టు తెలిపారు. కావున ఈలోను వ్యవహారము సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు ఉన్న యెడల రాతపూర్వక ఆధారాలతో ఏడు(7) రోజులలో కింది చిరునామాలో గల వారికి తెలుపగలరు. గడువు తదుపరి వచ్చిన అభ్యంత రములు చెల్లనేరవు.

**ఎం. సునీల్ కుమార్**
**అడ్వకేట్**
H.no.3-7-41, శ్రీరామ్ నగర్
పెద్దపల్లి -505172
సెల్.9866112209


## రామగుండం ఎన్టీపీసీకి ఎక్సలెన్స్ అవార్డులు

**సూర్య-గోదావరిఖని**



ఇక్కడి రామగుండం ఎన్టీపీసీకి 9వ అపెక్స్ ఇండియా హెచ్ఆర్ అండ్ సేఫ్టీ ఎక్సలెన్స్ అవార్డ్స్-2024 లో నాలుగు అవార్డులను సొంతం చేసుకుంది. ఈ మేరకు శనివారం రాత్రి గోవాలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. అపెక్స్ ఇండియా టెక్నాలజీ ఎక్సలెన్స్ విభాగం లో ప్లాటినం అవార్డు, హెచ్ఆర్ ఎక్సలెన్స్‌లో బంగారం, ట్రైనింగ్ ఎక్సలెన్స్‌లో గోల్డ్, థర్మల్ పవర్ సెక్టార్ కేటగిరీలో ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ విభాగంలో గోల్డ్ అవార్డును ఇక్కడి హెచ్ఆర్ విభాగానికి చెందిన అధికారులు అందుకు న్నారు. రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్ట్ నాలుగు అవార్డులను సొంతం చేసుకోవడం పట్ల ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు ఉద్యోగులను, అధికారులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని బంగారు అవార్డులను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు.

## నేడు హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్న మంత్రి శ్రీధర్ బాబు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం బుధవారం పేట్ (రామయ్య పల్లి) హెల్త్ సబ్ సెంటర్‌ను సోమవారం శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ శాఖ మాత్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు విచ్చేస్తున్నారు. రూ.20లక్షల నిధులు కేటాయించారు. మంత్రి పర్యటనను రామగిరి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకులు, యూత్ సభ్యులకు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు అందరు పాల్గొని విజయవంతం చేయలని మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్య కోరారు.

## తండ్రి స్మారకార్థము... బెంచీల్ పంపిణీ

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం పన్నూర్ గ్రామానికి చెందిన కీర్తి శేషులు కుంట రామ చంద్రయ్య స్మారకర్థంగా ఆయన కుమారుడు కుంట కుమారస్వామి సిమెంట్ బెంచీల్ కొనుగోలు చేశారు. ఈ మేరకు పన్నూర్ తాజా మాజీ ఎంపీటీసీ చిందం మహేష్,లొంక కేసా రం గ్రామ తాజా, మాజీ సర్పంచ్ ఎండీ మంజుర్‌లు వీటిని ప్రాంభించారు. పన్నూర్ మెయిన్ సెంటర్ లో 2 సిమెంట్ బెంచీలు,మార్కెట్ పరిధిలో 2 సిమెంట్ బెంచీలు,పన్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 2 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పన్నూర్ గ్రామ ప్రజలు అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవా రామస్వామి, ముత్యాన్న,ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్ పి హెచ్ ఎస్‌లో ఎన్ సి సి డే వేడుకలు

**సూర్య ఓదెల**

పోత్కపల్లి జెడ్పిహెచ్ఎస్‌లో ఎన్‌సిసి డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు వై శ్రీనివాస్ ఎన్ సి సి గురించి విద్యార్థులకు వివరించారు. దేశంలో ఎన్ సి సి కి ఉన్న ముఖ్యమైన పాత్రను గుర్తుచేస్తూ కేవలం శిక్షణ మాత్రమే కాకుండా దేశ సేవకు సన్నదమయ్యే ఒక గొప్ప అవకాశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాల పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ సి సి విద్యార్థుల్లో దేశభక్తితో పాటు సామాజిక బాధ్యతను నిర్వర్తించడంలో ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. యువత దేశ భద్రత, భవిష్యత్తుకు ఆదర్శంగా ఉండాలని ఉపాధ్యాయులు తెలిపారు. స్థానికుల ప్రోత్సాహంతో కార్యక్రమం మరింత విజయవంతమైందని ఉపాధ్యాయులు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులకు భద్రయ్య, జైపాల్ రెడ్డి, రామకృష్ణ, టి రవీందర్, హరికృష్ణ ,రఘుపతి అమృత కిషోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితురాలికి అండగా నిలిచిన ఎన్ఆర్ఐ, తాజా మాజీ సర్పంచ్

**సూర్య ధర్మారం**



ధర్మారం మండలం కొత్తూరు గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన రేషవేణి రజిత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, వారి కుటుం బానికి ఎన్ఆర్ఐ కొలుముల దామోదర్ యాదవ్, గ్రామ తాజా మాజీ సర్పంచ్ తాళ్ళ మల్లేశం గౌడ్ అండగా నిలిచారు. దామోదర్ యాదవ్ కొలుముల ఫౌండేషన్ తరపున 5,000 రూపాయలు, తాళ్ల మల్లేశం గౌడ్ తనవంతుగా 5,000 రూపాయల ఆర్థిక సాయాన్ని వారి కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ మద్దెల నర్సయ్య, నాయకులు పులకొల్ల లింగమూర్తి, రేషవేణి కొమరయ్య, రేషవేణి రాజేశం, నెరువట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణాన్ని సుందరీకరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**- ఎమ్మెల్యే విజయ రమణారావు**

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**



పట్టణాన్ని సుందరీకారంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. 2.11కోట్ల రూపాయలతో పెద్దపల్లి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆదివారం ఎమ్మెల్యే స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని చందపల్లి 15,16,17 ,18 వ వార్డులల్లో టి యు ఎఫ్ ఐ డి సి నిధులతో 2 కోట్ల 11 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మాణాలు చేపట్టే సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నేతేట్ల కొమురయ్య, రాజం మహంత, కోలిపాక సంధ్య చిరం జీవి, కోలిపాక శ్రీనివాస్, నాంసాని శ్రీనివాస్, తోట శంకర్, ఫణీంద్ర భూపతి, నూగ్గిళ్ల మల్లయ్య, భూతగడ్డ సంపత్, తూముల సుభాష్, సయ్యద్ మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వార్డుల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సభ్యత్వాల నమోదు

**సూర్య- పెద్దపల్లి రూరల్**



మండలంలోని పెద్దకల్వల గ్రామంలో మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మహిళా మోర్చా జిల్లా సభ్యత ఇంచార్జ్ సోమారపు లావణ్య ఆధ్వర్యంలో గ్రామంలోని ఇంటింటికి తిరిగి బిజెపి ప్రాథమిక సభ్యత్వం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మేకల శ్రీనివాస్ యాదవ్, పోల్సాని సంపత్ రావు, రామన్న పెద్దపెల్లి ఇంచార్జ్ ఒల్లే తిరుపతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సహారా ఇండియా బాధితులకు డబ్బులు వెంటనే చెల్లించాలి

**సూర్య-కోరుట్ల**



సహారా ఇండియా బాధితులకు డబ్బులు చెల్లించాలని కోరుట్లలో సాయిబాబా టెంపుల్ ఆవరణలో ఆదివారంసమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా సహారా ఇండియా బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఎం పూజిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో 13 కోట్ల మంది ఖాతాదారులు డబ్బులు 80 లక్షల కోట్ల రూపాయలు చెల్లించకుండా సహారా ఇండియా ప్రభుత్వం కాలయాపన చేస్తూ పేద ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందని అన్నారు. గత పార్లమెంటు ఎలక్షన్లో ప్రతి ఖాతాదారునికి నయా పైసతోసా చెల్లిస్తామని బహిరంగ సభలో చెప్పినటువంటి నరేంద్ర మోడీ అట్లాగే అమిత్ షా అధికారం వచ్చిన తర్వాత సహారా ఇచ్చిన హామీని నీటి మూటగా చేశారు. సుప్రీంకోర్టు కేసు పేరు మీద ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్య వైఖరిగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. మార్చ్ 2023లో పోర్టల్ ద్వారా చెల్లిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాపత్రిక ముఖంగా ఖాతాదారులు ఆన్లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని ప్రకటన ఇస్తే దేశంలో నాలుగు కోట్ల మంది ఖాతాదారులు దరఖాస్తు చేసుకుంటే కేవలం 300 కోట్ల రూపాయలు మాత్రమే ఖాతాదారులకు ఇవ్వడం జరిగింది భవిష్యత్తులో ఎన్నో అవసరాలకు పనికొస్తాయని కొండంత ఆశతో ఖాతాదారులు పొదుపు చేసుకుంటే ఏ అవసరానికి పనికి రాకుండా డబ్బులు పోయాయని వారు అన్నారు. ప్రధాన కార్యదర్శి మీ బాలయ్య మాట్లాడుతూ గత పార్లమెంటు సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ బాండ్లు తెచ్చుకోండి డబ్బులు ఇచ్చే బాధ్యత నదని పార్లమెంటు సభల సాక్షిగా చెప్పినటువంటి ఆర్థిక శాఖ మంత్రి ఈరోజు ఎవరికి ఇవ్వకుండా ఊరికే ప్రజల్ని మభ్యపెడుతుంది అని అన్నారు. ప్రభుత్వము కోర్టు, సహారా ఇండియా కంపెనీ ఆడుతున్న నాటకంలో 13 కోట్ల ప్రజలు బలై తున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు సహారా డబ్బులు వచ్చేవరకు ప్రయత్నం చేయాలని అన్నారు. డబ్బులు రానీయెడల వచ్చే ఎలక్షన్లలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని వారు హెచ్చరించారు. జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ నిత్యం కూలి నాలుగు చేసుకొని పేద ప్రజలు పొదుపు చేసుకుంటే వారి డబ్బుల్ని కంపెనీ ఎగనామం పెట్టిందని అన్నారు. అధిక వడ్డీ ఇస్తామని ఆశ చూపి ప్రజల నుంచి డబ్బుల్ని కంపెనీ దోచుకున్నదని అన్నారు. జగిత్యాల జిల్లా అధ్యక్షులు నారాయణ మాట్లాడుతూ పోర్టల్ ద్వారా ఇస్తామని ప్రజల్ని మభ్యపెడుతుందని అన్నారు పిల్లల పెండ్ల కోసం గృహ నిర్మాణం కోసం చదువుల కోసం పనికి వస్తాయని పొదుపు చేసుకుంటే ఏ పనికి రాకుండా పోయాయని అన్నారు. ఈ సభలో 200 పైగా కాతదారులు పాల్గొని వారి గోడును వినిపించారు. ఈ కార్యక్రమంలో జక్కుల గణేష్, ముత్యాల నరేష్, రామస్వామి, బి నారాయణ, గొప్ప రాతి శ్రీనివాస్, సిరిపురం రాజ్ కుమార్, బోప్పరాతి పురుషోత్తం, అల్లే గంగాధర్, ప్రభాకర్, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

**- జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్**

**సూర్య, జగిత్యాల**



జగిత్యాల పట్టణంలో గత కొన్ని రోజుల క్రితం గాంధీ విగ్రహం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని జిల్లా పోలీస్ అధికారులను డిమాండ్ చేస్తూ జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి సమయంలో గాంధీ విగ్రహం, అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి పారిపోయారనీ పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని అన్నారు. ధ్వంసంమైన విగ్రహాలకు మరమ్మతులు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన గాంధీ విగ్రహం, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాలను జగిత్యాల మున్సిపల్ పక్షాన మరమత్తులు చేపడుతామని చైర్ పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు.

## ఆర్.ఎం.పి, పి.ఎం.పి మండల అధ్యక్షుడిగా పెంట సుధాకర్

**సూర్య మల్యాల**



మల్యాల మండల కేంద్రంలో ఆదివారం మండల ఆర్.ఎం.పి, పి.ఎం.పి కార్యవర్గ కమిటీ నిర్వహించారు.ఆర్ ఎం పి, పి.ఎం.పి మండల అధ్యక్షుడుగా పెంట సుధాకర్ ప్రధాన కార్యదర్శిగా నక్క మధుకర్, కోశాధికారిగా ఇజ్జగిరి గంగాధర్, గౌరవ అధ్యక్షులుగా కొండ జనార్ధన్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఐలేని రాజేశ్వర్ రెడ్డి, కోశాధికారి కంది చంద్రశేఖర్ రావు, జోనల్ అధికార ప్రతినిధి కుసుమ శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సందుపట్ల రాజేశం, ఎథిక్స్ చైర్మన్ కోల మహేందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆకుల నాగరాజు, డివిజన్ అధ్యక్షులు కట్కం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గూడ లక్ష్మీనారాయణ, మల్యాల మండల మాజీ అధ్యక్షులు విశ్వనాథం, ప్రధాన కార్యదర్శి భూపతి,కోశాధికారి రమేష్, మల్యాల మండల ఆర్.ఎం.పి,పి.ఎం.పి సభ్యులు పాల్గొన్నారు.

## మణికంఠుడి మాలధారణ

**సూర్య మల్లాపూర్**



మండలంలోని కొత్తదామరాజ్ పల్లి గ్రామానికి చెందిన భక్తులు స్వామియే శరణమయ్యప్ప నామస్మరణలతో భక్తి శ్రద్ధలతో స్నానం ఆచరించి అత్యంత కఠినమైన నియమాలు గల మణికంఠుడి మలాధారణ ను గురుస్వామి వినోద్ ఆధ్వర్యంలో ఆదివారం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు బట్టు రవి, నారాయణ, రామ్ రెడ్డి, సుధాకర్, గంగారెడ్డి, శ్రీనివాస్, శ్రీధర్ సంతోష్లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## అప్పులు చేసి అభివృద్ధి చేశాం

**- పెండింగ్ బిల్లులు విడుదల చేసి ప్రభుత్వం ఆదుకోవాలి**

**సూర్య గంగాధర**



గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా అప్పులు చేసి అభివృద్ధి చేశామని పెండింగ్ బిల్లులు విడుదల చేసి ప్రభుత్వం ఆదుకోవాలని తాజా మాజీ సర్పంచ్‌ల జేఏసీ జిల్లా అధ్యక్షుడు జోగు లక్ష్మీరాజం అన్నారు. గంగాధర మండల కేంద్రంలో తాజా మాజీ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లా డారు.భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని మధురానగర్ ఎక్స్ రోడ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా డ్రైనేజీ, పైప్ లైన్లు, వీధి దీపాలు ట్రాక్టర్ ఖర్చులు డంపింగ్ యార్డులు, రోడ్లు స్మశాన వాటకలు వంటి అభివృద్ధి కార్యక్రమాల పనులకు అప్పులు చేసి ఖర్చుల పాలయమన్నారు. కొంతమంది సర్పంచులు ఆత్మహ త్యలు చేసుకున్నారని వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నవీన్ రావు, మడ్ల పెల్లి గంగాధర్, వేముల లావణ్య అంజి, వేముల దామోదర్, ఎండి నజీర్, మల్లేశం, ఆదిమల్లు తదితర సర్పంచులు పాల్గొన్నారు

## జాతీయ కవి అత్మీయ సమ్మేళనంలో జగిత్యాల జిల్లా కవులకు సన్మానం

**సూర్య జగిత్యాల**



కరీంనగర్ జిల్లా కేంద్ర ంలో సోషల్ మీడియా గ్రూపు కవి సాయం త్రం 6వ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం నిర్వహించ డం జరిగింది. ఇట్టి సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మహాత్మా జ్యోతి పూలే జాయింట్ సెక్రటరీ శ్యాం ప్రసాద్ లాల్, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్య క్షులు పొన్నం రవించందర్ గౌడ్, కవి సాయంత్రం గ్రూపు అధ్యక్షుడు ముక్కెర సంపత్,ప్రముఖ రచయిత అన్నవరం దేవేందర్, ప్రముఖ ఉద్యమ గాయని వోల్లాల.వాణి ఇంకా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.ఇట్టి కార్యక్రమంలో జగిత్యాల జిల్లాకి చెందిన ఐకేపీ ఎపియం వోదెల గంగాధర్, రచయిత్రులు లక్కరాజు శ్రీలక్ష్మి, మూలస్తం లావణ్యలకు శాలువా, జ్ఞాపకల ను అందజేసి సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కి చెందిన గుండెటి రాజు,మాడిశెట్టి శ్రీనివాస్,అయిత అనిత, బండి విజయ్, అల్లే గంగసాగర్ పలువురు అభినందనలు తెలియ జేశారు.

## పారమిత పాఠశాలలో ఆకట్టుకున్న నేషనల్ రేసింగ్ డే వేడుకలు

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



24 నవంబర్ ఆదివారంరోజున స్థానిక నగరంలోని పారమిత ఉన్నత పాఠశాలలో 76 వ నేషనల్ రేసింగ్ డే వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఇట్టి కార్యక్రమంలో నేషనల్ క్యాడెట్లు చేసిన పిరమిడ్లు, కవాతు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నేషనల్ రేసింగ్ డే కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ పట్టణంలోని కేర్ నియో హెల్పింగ్ హండ్స్ ఫౌండేషన్ అనాధ పిల్లల ఆశ్రమానికి వారం రోజులకు సరిపడే నిత్య అవసర సరుకుల, పుస్తకాలు అందజేసి ఎన్.సి.సి.కాడేట్లు వారి ఔదార్యాన్ని చాటిచెప్పారు. ఈ సంధర్భంగా ప్రధానోపాద్యాయులు మాట్లాడుతూ దేశ సేవలో నేషనల్ క్యాడెట్లు చేస్తున్న కృషి హర్షణీయం. అదే విధంగా పాఠశాల స్థాయి నుండి విద్యార్థిని విద్యార్థులు ఎన్.సి. సి పట్ల అవగాహన పెంచుకుని ఎన్.సి.సి లో చేరడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ సంధర్భంగా ఎన్.సి.సి. క్యాడెట్లకు పాఠశాలల ఛైర్మన్ డా. ఇ. ప్రసాదరావు నేషనల్ క్యాడెడ్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో, పారమిత పాఠశాలల డైరెక్టర్లు, ప్రసూన, రాకేష్, ప్రాచీ, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వి.యు.ఎం.ప్రసాద్,హనుమంతరావు, టి. యస్వీ. రమణ, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్ సమన్వయకర్త శ్రీనాథ్, NCC కేర్ టేకింగ్ ఆఫీసర్ బి.ప్రశాంత్, ఎక్స్ సర్వీస్ మెన్ రమేష్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## హరీష్ రావుకు ఘన స్వాగతం

**సూర్య జమ్మికుంట**



ప్రైవేటు కార్యక్రమానికి హుజూరాబాద్ నియోజకవర్గానికి వచ్చిన మాజీ మంత్రి సిద్దిపేట శాసన సభ్యులు తన్నీరు హరీశ్ రావు కు జమ్మికుంటలో బిఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. వీణవంక నుండి హుజురాబాద్ వెళుతుండగా జమ్మికుంటలో ఘన స్వాగతం పలికారు. ఇందులో జమ్మికుంట మునిసిపల్ ఛైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్ రావు పొనగంటి సంపత్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు,వార్డ్ అధ్యక్షులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాలల సింహ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

**సూర్య, హుజురాబాద్**



ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ ఒకటో తేదీన జరిగే మాలల సింహగర్జన విజయవంతం చేయాలని కరపత్రాన్ని మాల మహానాడు నాయకులు హుజురాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాల మహానాడు నాయకులు సొల్లు బాబు, కాయిత రాములు, పాక సతీష్, తోగరు స్వామి, పసుల స్వామి, కోడం నర్సింగం, సొల్లు సునీత, యేముల పుష్పలత, జిల్లా కో కన్వీనర్ జూపాక శ్రీనివాస్, తోగరు బిక్షపతి, మాజీ వార్డు సభ్యులు ముక్క రమేష్, గునిగంటి మొగిలి, సందమల్ల సంపత్, ముక్క నరసింగం, జూపాక నర్సింగం, ముక్క రమేష్, ముక్క రఘుపతి, గోకారం శ్రీనివాస్, చందమల్ల రాజమౌళి, ముక్క రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**సూర్య సెంటినరీ కాలనీ**



పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామంలో రామగిరి మండల మాజీ కో ఆప్షన్ మెంబర్ ఇబ్రహీం తాత అంకుస్ ఇటీవల మరణించగ వారి చిత్రపటానికి ఆదివారం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పూలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# కాంగ్రెస్ ఏడాది ప్రజాపాలనపై సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నారు

## - సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



బీఆర్ఎస్ పార్టీ ధృతరాష్ట్ర, అవినీతి, అక్రమ పాలన అంతమొందించి, కాంగ్రెస్ ప్రజా పాలన ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ ప్రజా పాలనతో తెలంగాణ రాష్ట్రంలోని సబ్బండ వర్గాలు సంతోషంగా ఉన్నారని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు అందుతున్నాయన్న సంతోషాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారని శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని 51వ డివిజన్ లోని మార్కెట్ రోడ్ శ్రీ వెంకటేశ్వర స్వామి గుడి వద్ద నగర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సర్దార్ ధన్నా సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ఏర్పడి ఏడాది కావస్తున్న సందర్భంగా సంబరాలకు ముఖ్య అతిథిగా నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలతో మమేకమై ఈ సంబరాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. 500కు గ్యాస్ సిలిండర్ వస్తుందా, బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నారా, 200 యూనిట్ల లోపు వినియోగించుకున్న లబ్ధిదారులకు గృహ జ్యోతి వస్తుందా, కులగణన సక్రమంగా జరుగుతుందా అని ప్రజలను తాము అడిగితే సంతోషం వ్యక్తం చేస్తున్నారని,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ తాము తమకు సకాలంలో అందుతున్నాయని, ఆనందంగా చెప్పడంపై రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని, ఇచ్చిన మాటకు కట్టుబడి హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. గతంలో రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ పాపాలు తెలంగాణ ప్రజలకు శాపాలుగా మారాయని ఆరోపించారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన పాపాలను కడుగుతూ ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రజాపాలనను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందిస్తుందన్నారు. నగరవ్యాప్తంగా కలియతిరిగి ప్రజలను కలుస్తూ వారికి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీసి రాబోయే 15 రోజులపాటు సంబరాలను నిర్వహిస్తామన్నారు. తాము వెళ్లిన చోటల్లా ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, స్వచ్ఛందంగా ప్రజలు సంబరాలు పాల్గొంటున్నారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తమకు బేషుగ్గా అందుతున్నాయని, ప్రజా పాలనను అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాబోయే 20 సంవత్సరాలపాటు అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుండటి శ్రీనివాస్ రెడ్డి, శ్రవణ్ నాయక్,రాజా గౌడ్, పోండ్ల రమేష్,తమ్మిడి ఏజ్రా, మాసూమ్ ఖాన్, బషీర్, సత్యనారాయణ రెడ్డి, కిరణ్ రెడ్డి, ఖలీల్, భారీ, కీర్తి కుమార్, రజిత రెడ్డి, ముల్కలా కవిత, ఊరడి లత, జ్యోతి రెడ్డి, షబానా పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

**సూర్య, హుజురాబాద్ రూరల్**



హుజురాబాద్ మండలం సింగాపూర్ గ్రామంలో జయన్న ఫౌండేషన్ మాజీ ఎంపీటీసీ గుడిపాటి సరిత జైపాల్ రెడ్డి, హైదరాబాద్ శంకర కంటి ఆసుపత్రి ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఆదివారం సింగాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని జయన్న ఫౌండేషన్ ఫౌండర్ గుడిపాటి జయపాల్ రెడ్డి ప్రారంభించారు. సుమారు 500 మందికి నేత్ర పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను అందజేశారు. మరి కొంతమందికి వైద్యులు పలు సలహాలు, సూచనలు అందించారు. నేత్ర, శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి హైదరాబాద్ లోని కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ వారి శంకర కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని బస్సుల్లో ఆసుపత్రికి తీసుకొని వెళ్లి చికిత్స అనంతరం తిరిగి మందులు అందించి ఇంటి వద్దకు పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 27న హుజురాబాద్ మండలం ధర్మరాజు పల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. జయన్న ఫౌండేషన్ ద్వారా హుజురాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజలకు అనేక వైద్యపరమైన సేవలు అందిస్తున్నట్లు, ఆయన మండలంలోనే కాకుండా నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు సైతం గత ఏడాది ప్యాడ్లు, పెన్నులు, కంపాస్ లు అందజేయడం జరిగిందని, ఆయన ఫౌండేషన్ ద్వారా అనేక రకాలైన సేవా కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తున్నట్లు, ఆయన ప్రజల సహకారం ఉంటే మరిన్ని కార్యక్రమాలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడానికి జయన్న ఫౌండేషన్ కృషి చేస్తుందని, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు గుడిపాటి సరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది ఇంద్రసేనారెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ 14 వ డివిజన్ రాంనగర్, సప్తగిరి కాలనీ, 15 వ డివిజన్ మార్కండేయ నగర్, ప్రగతినగర్ పరిధిలోని గల ప్రతిమ అర్బన్ సెంటర్లో ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన 14 వ డివిజన్ కార్పొరేటర్ దిండిగాల మహేష్, ప్రతిమ హాస్పిటల్ క్యాంప్ ఇంచార్జ్ సంపత్ రావు,15 వ డివిజన్ సీనియర్ నాయకులు, సూడా మాజీ డైరెక్టర్, ప్రగతి లైన్స్ క్లబ్ అధ్యక్షులు చిటి రాజేందర్ రావు, పల్లవి స్వచ్ఛంద సేవా సంస్థ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు వొడ్నాల రాజు, శ్రీహరి రెడ్డి, ప్రతిమ హాస్పిటల్ గీతా రెడ్డీ, 14, 15 డివిజన్ల ప్రజలు, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిమ హాస్పిటల్ వారి ఉచిత సూపర్ స్పెషాలిటీ మోగా వైద్య శిబిరం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయడం జరిగింది అన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలుకి సన్మానం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్ తీగల గుట్టపల్లిలో మాణిక్యేశ్వరి మాత గుడి ఆవరణలో కరీంనగర్కు చెందిన అశోక్ నగర్ అభ్యుదయ సంఘం వారు కార్తీక వన భోజనాలలో కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ మహిళా అధ్యక్షురాలు చకిలం స్వప్న శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. అశోక్ నగర్ అభ్యుదయ సంఘం వారు చిరు సన్మానం చేయడం జరిగింది.

## చరిష్మాకు ప్రముఖుల ఆశీర్వచనాలు

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్లో జరిగిన మున్సిపల్ 23వ వార్డు కౌన్సిలర్ మొలుగు సృజన - పూర్ణచందర్ల కుమార్తె చరిష్మా శుభకార్యానికి హాజరై ప్రముఖులు ఆశీర్వచనాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ బాబు, మాజీమంత్రి పెద్దిరెడ్డి, తెలంగాణ మెడికల్ సర్వీసెస్ ఆఫ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు, హుజురాబాద్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**- ప్రణవ్ బాబు**

**సూర్య, హుజురాబాద్ రూరల్**



ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు అన్నారు. ఆదివారం హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలో వి. ప్రణవ్ బాబు ల ఆధ్వర్యంలో రేనే ఆసుపత్రి వైద్యులచే ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్తి కృష్ణారెడ్డి, నేరేళ్ల మహేందర్ గౌడ్, దేశిని కోటి, పొనగంటి మల్లయ్య, తిప్పారపు సంపత్, పోలంపల్లి శ్రీనివాస్ రెడ్డి, సమ్మెట సంపత్, లంకదాసరి లావణ్య, యేముల పుష్పలత, రాధ, అరవింద్, తరుణ్, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లాఅధ్యక్షురాలిగా దమ్మ గళ్ళ లత

**సూర్య కరీంనగర్ టౌన్**



ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లాలోని గణాంకాలభవన్లో జరిగిన మహిళ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ రాష్ట్ర కోర్ కమిటీ మెంబర్ ఎలకపల్లి కుమార్ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తూరు లక్ష్మణ్ ఆధ్వర్యంలో మహిళా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలిగా నియమాకమైన దమ్మ గళ్ళ లత మాట్లాడుతూ తన నియమానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న మాదిగకి, జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్కి, ఎమ్మార్పీఎస్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల రాజు యూత్ జిల్లా అధ్యక్షుడు ది కొండ కుమారస్వామి జగిత్యాల యూత్ జిల్లా అధ్యక్షుడు దికొండ అజయ్ కుమార్రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలువల మల్లయ్య అధికార ప్రతినిధి అల్వాల రవీందర్ మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి తాటి చామంతి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేసిన యుప్ టీవి అధినేత

**సూర్య, వీణవంక**



హుజురాబాద్ నియోజకవర్గం చెల్పూర్ గ్రామానికి చెందిన ధూమ్ ధాం కళాకారుడు తెలంగాణ ఉద్యమంలో తన గళం ఎత్తి తన పాటలతో ప్రజలను చైతన్య పరచిన కళాకారుడు శనిగరపు బాబ్జీ - అరుణ దంపతుల కుమార్తె వెన్నెల వైద్య విద్య (ఎంబిబిఎస్) చదువుతున్న క్రమంలో బాబ్జీ కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృశ్య వెన్నెల తల్లిదండ్రులు యుప్ టీవీ అధినేత పాడి ఉదయ్ నందన్ రెడ్డి కి ఎంబిబిఎస్ విద్యకై ఆర్థిక సహాయం కావాలని అడిగిన వెంటనే స్పందించి వెన్నెల డాక్టర్ చదువు కోసం తన అనుచరులచే 25,000 రూపాయలను వెన్నెల తల్లిదండ్రులకు అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుడు బాబ్జీ మాట్లాడుతూ ఉదయ్ నందన్ రెడ్డి ఆపద్బాంధవుడిగా వైద్య, విద్య కోసం అడిగిన వెంటనే స్పందించి ఆర్థిక సహకారం అందజేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మక్కపల్లి మాజీ ఉప సర్పంచ్ సమ్మిరెడ్డి, వెన్నంపల్లి నారాయణ, మంతెన శ్రీధర్, దాసారపు లోకేష్, వంశీకృష్ణ, సంతోష్, తాళ్లపల్లి కుమారస్వామి, పస్తం కుమార్, సిరిగిరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి వినతి

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



కరీంనగర్లోని జ్యోతిబా పూలే మైదానంలో జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్లు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ మరియు యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు సంజీవ్లు కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మంత్రి గారితో మాట్లాడుతూ అప్పటి ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ కరీంనగర్ లోని సర్కస్ మైదానాన్ని సుందరీకరించి జ్యోతిబా పూలే మైదానంగా నామకరణం చేసినారు. ఆ మైదానంలో జ్యోతిబా పూలే పుణ్య దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయిస్తానని మాట ఇచ్చారు కానీ వారి పదవీ కాలం ముగిసి పోయి మీరు ఎంపీగా ప్రస్తుతం మంత్రిగా ఉన్నారు. ఇప్పటికైనా మీరు చొరువ చూపి ఆ పుణ్య దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే కరీంనగర్ పట్టణంలో అన్ని బీసీ కులాలకు ఒకే వేదిక లాగా బీసీ సంక్షేమ భవన్ కు భూమి కేటాంచి నిర్మాణం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సం ఘం పట్టణ అధ్యక్షులు కాసరాజు, కొట్టే శివ తోపాటు బీసీ సంక్షేమ సం ఘం మరియు అనుబంధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ బొల్లి ఐలయ్య సొంతమైన పతాంజలి సర్టిఫికెట్

**సూర్య చిగురుమామిడి**



మండల కేంద్రానికి చెందిన బొల్లి ఐలయ్య కరీంనగర్ పట్టణంలో యోగా ట్రైనింగ్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ముత్యాల రమేష్ దగ్గర కొన్ని సంవత్సరాల నుండి డాక్టర్ బొల్లి ఐలయ్య ముదిరాజ్, బొల్లి అఖిల, బొల్లి విష్ణువర్ధన్లు యోగ ప్రాక్టీస్ చేస్తున్న వీరికి యోగ టీచర్గా పతాంజలి సర్టిఫికెట్ను కరీంనగర్ ఆర్డిఓ కే మహేశ్వర్ చేతుల మీదుగా ఆదివారం అందజేశారు. చిగురుమామిడి మండలానికి చెందిన వీరి ముగ్గు రు కరీంనగర్ ఆర్డిఓ మహేశ్వర్ చేతుల మీదుగా యోగా టీచర్స్గా నియా మక పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో భారత్ స్వాబీమాన్ ముఖ్య సంరక్షకుడు డివి రావు, కొండ లక్ష్మణ్, మధు, మనోజ్,అరుణ్ జ్యోతి, పాల్గొన్నారు.

# పద్మశాలి యువత ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

**సూర్య కోరుట్ల టౌన్**




కోరుట్ల పట్టణంలోని పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘ భవనంలో యువత ఆధ్వర్యంలో మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ల సహకారంతో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ నీలం శ్రీనివాస్ పాల్గొని వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.డాక్టర్ నీలం శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ చలికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యాధుల నుండి కాపాడుకోవాలని,డెంగ్యూ,చికెన్ గున్యా బారిన పడకుండా దోమలు నివసించే నీటి నిల్వలు ఉండకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, చలికాలంలో దమ్ము ,దగ్గు వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఉచిత వైద్య శిబిరం యువత ఆధ్వర్యంలో నిర్వహించడం చాలా అభినందనీయం అని,ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, డబ్బు సంపాదించడం వెంట పడకుండా ఆరోగ్యం కూడా కాపాడుకోవాలని సూచించారు.మమత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మిట్టపల్లి రాజేష్ మాట్లాడుతూ ఇప్పుడు అంతా వైరల్ జ్వరాల సీజన్ నడుస్తుంది,పది సంవత్సరాల లోపు పిల్లలు జ్వరాల బారినపడకుండా ద్రవ పదార్థాలు, విటమిన్లు ఎక్కువ ఉండే ఆహారం తీసుకోవాలని, చలికాలంలో చిన్నపిల్లలు జలుబు,దగ్గు బారిన పడే అవకాశం ఎక్కువ ఉంటుంది.చిన్నపిల్లలకి వెచ్చటి దుస్తులు ధరించాలి,ఇంట్లో గదుల టెంపరేచర్ కూడా వెచ్చగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.డాక్టర్ సంతోష్ కుమార్ & డాక్టర్ మధు శ్రీ మాట్లాడుతూ ఇలాంటి పెద్ద శిబిరాల్లో పాల్గొని ఉచితంగా వైద్య సేవలు చేయడానికి ఎల్లప్పుడూ ముందుంటామని,యువత ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. దాదాపు 500 మంది ప్రజలు వైద్య శిబిరంలో పాల్గొని ఉచితంగా వైద్యం, మందులు, రక్త పరీక్షలు, PFT పరీక్షలు చేయించుకున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గుంటుక ప్రసాద్,జిల్లా అధ్యక్షులు రుద్ర శ్రీనివాస్,యువత అధ్యక్షులు జక్కుల ప్రవీణ్ కుమార్,మున్సిపల్ కౌన్సిలర్లు ఎంబేరి నాగభూషణం,పెండెం గణేష్,పోప అధ్యక్షులు అందే శివప్రసాద్,కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహ కమిటీ అధ్యక్షులు ముల్క ప్రసాద్,నాయకులు గడ్డం మధు,బండ్ల రవి కుమార్,అందే రాజ్ కుమార్, గోసికొండ కుమారస్వామి,యువత కార్యవర్గం బండి సురేష్ చింతగింది ప్రేమ్,రాడం మహేందర్,రుద్ర విగ్నేష్,కటకం శివకుమార్, గాజెంగి మనీష్,పద్మశాలి సంఘం కార్యవర్గం, గోసికొండ కుమారస్వామి,రుద్ర సురేష్,పడాల గణేష్,ఎక్కలి దేవి రామచంద్రం, నల్ల ప్రశాంత్, దైవశెట్టి వంగరి గణేష్,అల్లే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేను సామాజిక సేవకుడినీ

**- కార్పొరేట్ కళాశాలలు ఏర్పాటు చేయడమే అర్హత కాదు - రాజకీయ పునరావాస కేంద్రంగా మారిన పెద్దల సభ**

**- ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నా, ఆశీర్వదించండి - అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




తాను సామాజిక సేవకుడిననీ ఏ రాజకీయ పార్టీతో అనుబంధం లేకుండా నిరుద్యోగులకు, ఉద్యోగులకు సేవలు అందిస్తున్నానని, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజాంబాద్ మెదక్ ఉమ్మడి జిల్లాల అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తనను ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక పొన్నాల గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేట్ల సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెద్దల సభకు సామాజిక సేవకుడిగా తాను పోటీలో ఉంటున్నానని,ఎమ్మెల్సీగా పోటీ చేయాలంటే కార్పొరేట్ కళాశాలలు ప్రారంభించడం అర్హత కాదని అన్నారు. పెద్దల సభ అంటే సమాజంలో పాలకులు చేసిన దుందుడుకు చట్టాలను సమీక్షించి ప్రజలకు ఎటువంటి ఆపద కలగకుండా చూసుకోవడం కే ఏర్పాటు చేయబడిందని వివరించారు. అటువంటి పెద్దల సభ నేడు మేధావులతో కాకుండా రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గత 19 సంవత్సరాల నుండి చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలి నేడు ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి ఇప్పటివరకు నిరుద్యోగులకు తన వంతు సహాయంగా తన జీతం నుండి ముప్పై శాతం తన జీతాన్ని సేవకై కేటాయించానని అన్నారు. జగిత్యాల జైత్రయాత్రకు ఏమాత్రం తగ్గకుండా నిరుద్యోగులు, విద్యావంతులు, మేధావులు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఐక్యంగా ముందుకు కదలి తనను గెలిపించాలని హరికృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళాశాల కరస్పాండెంట్ ముసిపట్ల రాజేందర్, జగిత్యాల భార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భూమి రమణ కుమార్, బీసీ సంఘం నాయకులు బ్రహ్మాండభేరి నరేష్ ముసిపట్ల లక్ష్మీనారాయణ, కోటగిరి వెంకటేశ్వర్లు, దాసరి రాజేందర్, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్లు తదితరులు పాల్గొన్నారు.

## సహకార శాఖ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ నూతన కమిటీ నియామకం

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



ఆదివారం రోజు సహకార భవనంలో కరీంనగర్ జిల్లా సహకార శాఖ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ 1995 యాక్ట్ సంఘ ఎన్నికల ప్రకారం ఎన్.రాజయ్య ఎన్నికల అధికారి నిర్వహించినారు. ఈ ఎన్నికలో కరీంనగర్ జె.ఆర్/డిసిఓ, ఎస్.రామాంజనేయ చార్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యుల వివరాలు అధ్యకులుగా సి.హెచ్. చంద్ర ప్రకాష్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎం.లక్ష్మణా చారి, కార్యదర్శిగా ఎం.శ్యామ్ సుందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ కె.జమున రాణి, ట్రెజరర్ గా నర్సయ్య, డైరెక్టర్లు గా మహమ్మద్ జలాలుద్దీన్ అక్బర్, పి.సురేందర్ రెడ్డి, మహమ్మద్ అసద్, టి.రాజేంద్రప్రసాద్,బి.రాములు, కె.రవికుమార్, మహ మ్మద్ గయాజ్ అహ్మద్, డైరెక్టర్లు గా ఎన్నుకున్నారు. రాబోయే రోజుల్లో సహకార శాఖ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు కరీంనగర్ జిల్లా దగ్గర ప్రాంతంలో స్థలము పరిశీలించి హౌసింగ్ సొసైటీ కొరకు ప్లాట్లను పరిశీలించి కొనుటకు, ఉద్యోగులకు ప్లాట్లు ఇప్పించుటకు కృషి చేస్తారని ఈ సందర్భంగా కొత్తగా ఎన్నుకున్న కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఉద్యోగులు, రిటైర్ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రణవ్ బాబుకి ఘన సన్మానం

**సూర్య, ఇల్లందకుంట**



జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతనంగా నియామకమైన ఇల్లందకుంట మండలం లక్ష్మాజి పల్లి గ్రామానికి చెందిన ఉప్పుల శ్రీనివాస రెడ్డి హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చా ర్జ్ వొడితల ప్రణవ్ బాబుని గజమాలతో సత్కరించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రణవ్ బాబు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ రైతు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. రైతు సంక్షేమ లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ పథకాలను గ్రామ గ్రామాన ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇంగిలే రామారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోడిశాల పరమేష్, సింగిరెడ్డి గోపాల్ రెడ్డి, మూడెత్తుల మల్లేష్, ఎడ్ల కిషన్ రెడ్డి, ఉప్పుల అమరేందర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి లాల్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ కో ఎస్ ఈని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీపీ

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



పెద్దపల్లి జిల్లా ట్రాన్స్ కో ఎస్ ఈ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన మాధవరావు ను కాల్వ శ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్ ఇ ని మర్యాదపూర్వకంగా కలిసి బోకే అందించి శాలువాతో సన్మానించారు. మాజీ ఎంపీపి గోపగోని సారయ్య గౌడ్ వెంట పోల్సాని సునీల్ రావు ఉన్నారు.

## కోర్టులో ఈ సేవ కేంద్రం ప్రారంభం

**సూర్య, హుజురాబాద్**



హుజురాబాద్ పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈ సేవ కేంద్రం ఆదివారం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా అన్ని మండల కేంద్రంలోని కోర్టులలో ఈ సేవా కేంద్రాలను సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహులు వర్చువల్ గా ప్రారంభించారు. హుజురాబాద్ కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ పాలడుగు అలేఖ్య రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అలేఖ్య మాట్లాడుతూ కోర్టులో ఉన్న ఈ సేవ కేంద్రాల్లో కక్షిదారులు తమ తమ యొక్క కేసు వివరాలని తెలుసుకోవడానికి వీలవుతుందని అన్నారు. అదే విధంగా న్యాయవాదులు సైతం దీనిని అనుసరించి తమ యొక్క కోర్ట్ లో కేసులను దాఖలు చేయవచ్చని తెలిపారు. ప్రజలందరూ ఈ సేవ కేంద్రాలని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోస్కుల శ్రీనివాస్, సెక్రెటరీ తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ రమేష్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహంపై దాడిచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

**- ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్**

**సూర్య జగిత్యాల**



జగిత్యాల నడిబొడ్డున ఉన్న జాతిపిత నవ భారత రాజ్యాంగ నిర్మాత డా.బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ ఆదివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిలా కేంద్రంలోని జగిత్యాల నడిబొడ్డున ఉన్న విగ్రహాన్ని ధ్వంసం చేయడమంటే చాలా దురదృష్టకరమైన విషయం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే ఇలాంటి దాడి జరిగిం దన్నారు.అంబేద్కర్ విగ్రహంపై దాడిని అన్ని వర్గాల ప్రజలు పార్టీలు ముక్త కంఠంతో ఖండించాలన్నారు. అంబేద్కర్ విగ్రహం పై దాడి అంటే రాజ్యా ంగం పై దాడి జరిగినట్లేనని, దాడికి పాల్పడిన దుండుగులను వెంటనే గుర్తించి వారిని కఠినంగా శిక్షించి దేశ బహిష్కరణ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

## గుర్రం వెంకన్నకు మంత్రి సీతక్క నివాళులు

**సూర్య, హుజురాబాద్**



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి స్వర్గీయ గుర్రం వెంకటేశ్వర్ల సంవత్సరికం సందర్భంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆయనకు నివాళులు అర్పించారు. ఆదివారం హుజురాబాద్ పట్టణంలో గుర్రం వెంకటేశ్వర్ల కుమారుడు హరిబాబు ను కలిసి వెంకటేశ్వర్లతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. టిడిపిలో రాష్ట్ర నాయకుడిగా తమతో కలిసి వెంకటేశ్వర్లు పనిచేశాడని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క వెంట హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు, పుష్పలత, పలువురు నాయకులు ఉన్నారు.

### ఘనంగా ఆర్యవైశ్య

## మహాసభ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు**

**సూర్య వేములవాడ**




వేములవాడ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రంలో ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# కోర్టులో ఈ – సేవలు కేంద్రం ప్రారంభం

## - బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం

**సూర్య వేములవాడ**

వేములవాడ కోర్టులో ఆదివారం ఈ సేవా కేంద్రాన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తి పామిడి గంటం నరసింహ ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత, సీనియర్ సివిల్ జడ్జి, రాధిక జైస్వాల్, జూనియర్ సివిల్ జడ్జ్ జ్యోతిర్మయి, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, ఏజిపి పుప్పాల భాను కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం మాట్లాడుతూ ఈ సేవా కేంద్రం ద్వారా కేసు స్థితిగతులు, తదుపరి విచారణ తేది సంబంధిత విచారణలు స్వీకరించడం, సర్టిఫైడ్ కాపీలకు సంబంధించిన ఆన్లైన్ దరఖాస్తుల స్వీకరణ, హర్డ్ కాపీ పటిషన్ల స్కానింగ్, ఈ-సంతకం, సిఐ ఎస్లోకి దాఖలు చేయడం, ఫైలింగ్ నంబరును జనరేట్ చేయడం వంటి వాటితో పిటిషన్ల ఈ-ఫైలింగును సులభతరం చేయడం. ఈ స్టాంప్ పేపర్ల కొనుగోలులో కక్షిదారులకు



సహాయపడటం, ఆధార్ ఆధారిత డిజిటల్ సంతకాన్ని పొందుటలో సహాయపడటం, ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఆధారిత చరవాణులలో ఈ -కోర్స్ అనువర్తనానికి సంబంధించిన ప్రకటనలు వెలువరించడం, డౌన్లోడ్ చేసుకోవడం లో సహాయపడటం, ఈ-ములాఖత్ అపాయింట్మెంటు ద్వారా జైలులో ఉన్న బంధువులను కలవడానికి సహాయపడటం, సెలవుపైనున్న న్యాయాధికారులకు సంబంధించిన విచారణలకు సమాధానమివ్వడం, ఏదేని న్యాయస్థానము యొక్క చిరునామా స్థానానికి సంబంధించిన విచారణలకు, కాజీలిస్ట్, ఏదేని కేసు విచారణకు చేపట్టబడినదా లేదా అనే విచారణలకు సమాధానమివ్వడం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లేదా హైకోర్టు న్యాయ సేవాధికార సంస్థ లేదా సుప్రీం కోర్టు న్యాయ సేవాధికార సంస్థల నుండి ఉచిత న్యాయ సేవలను ఎలా పొందాలనే విషయంలో ప్రజలకు మార్గనిర్దేశకత్వం చేయడం, ట్రాఫిక్ చలాన్లు, చిన్న నేరాలకు సంబంధించిన ఫైన్ చెల్లింపులను ఆన్లైన్లో కట్టుటకు వీలు కల్పించడం, ఈ-కోర్టు సేవల ద్వారా డిజిటల్ రూపంలో అందుబాటులో ఉన్న అన్ని ఇతర సేవల గురించిన సందేహాలను నివృత్తి చేయడం వంటివి సులభతరంగా తెలుసుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు న్యాయవాదులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పొత్తూరి అనిల్ కుమార్, గుండా రవి, కిషోర్ రావు, బొడ్డు ప్రశాంత్ కుమార్, నర్సింగ రావు, గొంటి శంకర్, గుజ్జ మనోహర్, జెట్టి శేఖర్, జంగం అంజయ్య, అనిల్, మహిళా న్యాయవాదులు సుజాత, అన్నపూర్ణ పాల్గొన్నారు.

# ప్రియాంక గాంధీ గెలుపు పట్ల సంబరాలు

**సూర్య వేములవాడ**

ప్రియాంక గాంధీ వయనాడ్ ఉప ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలువడంతో కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుర్ర రవితేజ గౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామికి ఆదివారం మొక్కులు చెల్లించారు.రాజన్న ఆశీస్సులతో ప్రియాంక గాంధీ రికార్డు మెజారిటీతో విజయం సాధించిందని, ఆ నమ్మకంతో స్వామివారికి మొక్కులు తీర్చుకున్నామని పేర్కొన్నారు.త్వరలోనే దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడకు ప్రియాంక గాంధీ వస్తారనే ఆశాభావంతో ఉన్నామని తెలిపారు ఎంగత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో రాజన్న ఆలయం నిర్లక్ష్యానికి గురైందని, అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచిందన్నారు.కానీ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన పది నెలల కాలంలోనే రికార్డు స్థాయిలో 127కోట్ల రూపాయలు రాజన్న ఆలయానికి కేటాయించి, ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తుందని, ఇది కాంగ్రెస్ ప్రజా పాలనకు నిదర్శనం



అన్నారు.ఇక గత పాలకుడు రమేష్ బాబు నిర్లక్ష్యంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వెనకబడిందనేది జగమెరిగిన సత్యమని, ఈ క్రమంలోనే ఆయన వైఖరికి వ్యతిరేకంగా తాము అనేక పోరాటాలు చేసినా విషయం అందరికి తెలుసన్నారు. ముఖ్యంగా ఇక్కడే రాజన్న సాక్షిగా ఇదే వేదికగా భిక్షాటన కార్యక్రమం చేపట్టి రమేష్ బాబుపై ఒత్తిడి తీసుకువచ్చిన విషయం నాకు ఇప్పటికీ గుర్తుందని, బహుశా ఆనాటి పోరాటాల ఫలితమే అనుకుంటా వేములవాడ ప్రజలు దొరల పాలనకు చరమగీతం పాడి ప్రజా పాలనకు స్వాగతం పలికారని పేర్కొన్నారు. ఇదే క్రమంలో నియోజకవర్గ ప్రజలు విదేశీ పాలనకు ముగింపు పలికి, నిత్యం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల కష్టాల్లో పాలుపంచుకునే, జన హృదయ నేత ఆది శ్రీనివాస్కు పట్టాం కట్టారన్నారు.ఈ రోజు ఇక్కడి ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన ఆది శ్రీనివాస్ కు ప్రభుత్వం విప్ గా అవకాశం కల్పించి గౌరవించిందని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ఇతర మంత్రుల సహకారంతో విప్ ఆది శ్రీనివాస్ నాయకత్వంలో వేములవాడ రాజన్న ఆలయం, పట్టణం, నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందనే సంపూర్ణ నమ్మకం కలుగుతుందన్నారు. అధికారం చేపట్టిన అతి తక్కువ సమయంలోనే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గంతో పాటు యావత్ రాష్ట్రమంతటా కాంగ్రెస్ పార్టీ ఘన విజయానికి కృషి చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ కన్వీనర్ వివేక్, ఇమ్మడిశెట్టి విశాల్, నాగరాజు, రాజు, కిరణ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య విగ్రహా ఆవిష్కరణ

### - ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, ఎస్పీ రాహుల్ హెగ్డేకులకు ఆహ్వానం

**సూర్య, ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట మండలం పోత్తురు గ్రామంలోని యాదవ సంఘం భవనం ఆవరణలో కురుమ సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు,ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీగా పని చేసిన రాహుల్ హెగ్డే లను హైదరాబాద్లో ఆదివారం కలిసి డిసెంబర్ 1న దొడ్డి కొమురయ్య విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమానికి పొత్తురు గ్రామానికి రావాల్సిందిగా కోరుతూ ఆహ్వానించారు.అదేవిధంగా రవీంద్ర భారతిలో బాషా సాంస్కృతిక శాఖ ద్వారా ఒగ్గు డోలు (100)మంది కళాకారులను మానకొండూరు ఎమ్మెల్యే డా.కావ్వంపల్లి సత్యనారాయణను కోరగా ఆ శాఖకు లేఖ వ్రాసినట్లు ఓగ్గు కళాకారులు హాజరువుతున్నట్లు ఎమ్మెల్యే చెప్పినట్లు తెలిపినట్లు చెప్పారు.పొత్తూరు గ్రామ కురుమసంఘం అధ్యక్షులు, కార్యదర్శులు గుంటి బీరయ్య,గుంటి పాపయ్య, గుంటి మహేష్, ఈరు కొమురయ్య, గుంటి తిరుపతి (పర్టిలైజర్స్) ఒట్టే మహేష్ పోలె శ్రీనివాస్లు వున్నారు.

## రామగిరి సమగ్ర సర్వే

### - డేటా ఎంట్రీ వేగవంతం

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలంలో ప్రభుత్వము కుల గణనా, ఆర్థిక, రాజకీయ ఇతర అంశాలపై సర్వే నిర్వహిస్తుంది. ఈ క్రమంలో రామగిరి మండలంలో 17 గ్రామాలలో సర్వేను 102 మంది ఏనుమ్యూరేటర్లు నిర్వహిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ బద్రి శైలాజ రాణి, ఎంపీఓ దేవరకొండ ఉమేష్,ఐసీడీఎస్ సూపర వైజర్ లు పల్లె అనిత, పర్కల.శారదా, డిప్యూటీ తహసీల్దార్ యజ్ఞంబట్ల మానస, మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, ఆర్.ఐ లు కే. మహేష్,రెవెల్లి నిహారిక, ఐకేపీ ఏపీఎం గొట్టే స్వరూప రాణి, గ్రిడ్ ఏ.ఈ వాసవి, ఉపాధి ఈ.సీ రాసపల్లి లక్ష్మన్ లు ఆయా గ్రామాలలో సర్వే పనులను పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో రామగిరి మండలంలోని పూర్తి అయిన సర్వే ఫారంలను కంప్యూటర్లో భద్రపరుస్తున్నారు. ఈ మేరకు గత రెండు రోజులుగా డేటా ఎంట్రీ పనులు వేగవంతంగా నడుస్తున్నాయి. మండలంలో సర్వే దాదాపుగా పూర్తికా వచ్చింది. డోర్ లాక్ ఇల్లు మినహా అన్ని గృహంల సర్వే పూర్తి అయింది.

## ప్రభుత్వ విప్ ను కలిసిన మైనార్టీ గురుకుల నాయకులు

**సూర్య వేములవాడ**



వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని ఆదివారం తెలంగాణ మైనార్టీ గురుకుల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల 317 జీవో త్వరత గతిన నిర్ణయం నిర్ణయం తీసుకుని ఈ జీవో వల్ల నష్టపోతున్న రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగ వర్గాలకి న్యాయం చేయాల్సిందిగా విన్నవించారు. ఇప్పటికే సబ్ కమిటీ నివేదిక అందించిందని, కావున ప్రభుత్వం త్వరలో సమస్య పరిష్కరించవలసిందిగా కోరారు. దీనితో పాటుగా రాష్ట్రంలోని అన్ని గురుకులాలలో పాఠశాలల సమయం వల్ల అటు విద్యార్థులు ఇటు ఉపాధ్యాయులు సతమతమవుతుండడంతో పాఠశాలల సమయం ఉదయం 9 గంటల నుండి నాలుగు గంటల 30 నిమిషాల వరకు పాత టైం టేబుల్ ని కొనసాగించవలసిందిగా అభ్యర్థించారు. విద్యార్థులు సాయంత్రం వేళల్లో ఈ టైం టేబుల్ వల్ల చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రభుత్వ విప్ స్పందిస్తూ ప్రభుత్వానికి లేఖ రాస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పిఆర్టియు తెలంగాణ మైనార్టీ గురుకుల అధ్యక్షుడు మాలోతు శ్రీనివాస్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ పోతు సతీష్, కోశాధికారి వట్టిమల్ల పూర్ణచందర్ పాల్గొన్నారు.

## సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎంపిక

**సూర్య, సెంటినరీ కాలనీ**

సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రామగిరి మండలం నాగేపల్లి గ్రామానికి చెందిన పూదరి సత్యానారాయణ గౌడ్ ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్ ఎల్బీ స్టేడియం ఫతేమైదాన్ క్లబ్ లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యావర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షునిగా కానుగంటి సురేష్ కుమార్, ప్రధానకార్యదర్శిగా రిక్కల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా మినం వికెష్ కుమార్ లు ఎంపిక కాగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ఉపాధ్యక్షునిగా పూదరి సత్యనారాయణ గౌడ్తో పాటు సంయుక్త కార్యదర్శిగా గన్ను విజయభాస్కర్ రెడ్డి, కార్యవర్గ సభ్యునిగా కరుణాకర్ రెడ్డిలు ఎంపికయ్యారు. నూతన కార్యావర్గాన్ని సీఈఓ ప్రేమ్ రాజ్ శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు.

## 27న సులబ్ కార్మికుల సమస్యల పై ధర్నా

### - ఐ.ఎఫ్ట్.టీ.యూ వెంకన్న

**సూర్య, సెంటినరీ కాలనీ**



నవంబర్ 27వ తేదీ నా కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందు జరిగే సులభ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు పిలుపునిస్తుంది. సింగరేణి వ్యాప్తంగా సుమారు 200 సులబ్ కాంప్లెక్స్ లను సింగరేణి హ్యాండ్ వార్ లో సులభ ఇంటర్నేషనల్ సంస్థకు ఇవ్వడం జరిగింది. దీనివల్ల ఒక్క కాంప్లెక్స్ కు సుమారు 25 వేల రూపాయలు సింగరేణి యాజమాన్యం సులభ ఇంటర్నేషనల్ సంస్థకు చెల్లిస్తుంది.కానీ ఇక్కడ పనిచేస్తున్న కార్మికునికి 15వేల రూపాయలు ఇచ్చి, అది కూడా 30 రోజులు అక్కడనే పనిచేస్తాడు. వీరికి నేటికీ పిఎఫ్ బోనస్ వైద్యం ఇన్సూరెన్స్ ఎలాంటి చట్టబద్ధ హక్కులు అమలు కావటం లేదు వీరు చేస్తున్న పని వల్ల వచ్చే రోగాలకు బారిన పడి కొంతమంది కార్మికులు చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. కానీ వీరిని పట్టించుకున్న పాపాన పోలేదు. కాబట్టి వీరి సమస్యలను పలుదపాలుగా సింగరేణి ఎండీకి, డైరెక్టర్స్ కు జీఎం లకు, లోకల్ జీఎం లకు విన్నవించినప్పటికీ పరిష్కారం కానందున తిరిగి నవంబర్ 27వ తేదీన కొత్తగూడెం సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించాలని ఐఎఫ్టియు నాయకులు ఆకుల వెంకన్న కోరారు. ఈరోజు డివిజన్ లో సులభ వర్కర్లను కలవడం జరుగుతుంది. ధర్నాను విజయవంతం చేయాలని కార్మికులకు చెప్పడం జరుగుతుంది. సెంటినరీ కాలనీలో నాలుగు సులభ కాంప్లెక్స్ కార్మికులను కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సారయ్య,పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## అడ్రియాల మేనేజర్కు డీజీఎంగా పదోన్నతి

**సూర్య, సెంటినరీ కాలనీ**



అడ్రియాల మేనేజర్ కొడెం జనార్ధన్ కు పదోన్నతి లభించింది. డీజీఎం గా పదోన్నతి కల్పిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అర్జీ-3 క్వాలిటీ లో పనిచేస్తున్న మేనేజర్ బి.వి.సత్యనారాయణ కు డీజీఎం కు పదోన్నతి లభించింది.

